



కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం 16, జూన్ 2026 16 పేజీలు




## ప్రజా ఉద్యమంగా ప్రజాపాలన ప్రగతి

# ప్రణాళిక విజయవంతం

- ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం
- 38,417 కొత్త రేషన్ కార్డులు..
- 1.71 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి
- 7,680 ఇందిరమ్మ ఇళ్లకు అనుమతులు..
- 1,146 ఇళ్ల నిర్మాణం పూర్తి..
- 1.78 లక్షల మంది రైతులకు రూ.131 కోట్ల రైతు భరోసా

2 లో



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: ప్రజా ఉద్యమంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జగిత్యాల జిల్లాలో గత 99 రోజులుగా అభివృద్ధి, సంక్షేమం, ప్రజా చైతన్య కార్యక్రమాలకు వేదికగా మంత్రి నుంచి సర్పంచ్ , వార్డు మెంబర్ ప్రజలు వరకు, గ్రామ కార్యదర్శి నుంచి అధికా రుల వరకు అందరీ భాగ స్వామ్యంతో విజయ వంతంగా పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక. కార్య కమం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి శాసనసభ నియోజకవర్గాల్లో విజయ వంతంగా అమలై ప్రజల జీవితాల్లో స్పష్ట మైన మార్పును తీసుకు వచ్చిందని చెప్పవచ్చు.

## అక్రమ ఇసుక రవాణాపై..



# ఉక్కుపాదం..

### అక్రమ ఇసుక డంప్‌లు స్వాధీనం..
### టాస్క్‌ఫోర్స్ ఎసిపి సతీష్

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త: చాలా కాలంగా హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని అక్రమ ఇసుక పెద్ద మొత్తంలో పరిసర మండలాలకే కాకుండా హన్మకొండ, వరంగల్ లాంటి పట్టణాలకు అక్రమంగా రవాణ జరుగుతుందన్న అరోపణలు వెల్లువెత్తడంతో అక్రమ ఇసుక రవాణ అరికట్టడంలో స్థానిక పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు విఫలమయ్యారని రాష్ట్ర విజిలెన్స్ ఉన్నతాధికారులు ప్రభుత్వ యంత్రాంగానికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తుంది.

16 లో

## విద్యార్థుల సంఖ్య పెంపే



బ్రేక్ ఫాస్ట్ పథకం అమలు

# లక్ష్యం

- బడిబాటపై ఫోకస్..
- ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం
- అధికారుల ఆదేశాలతో ముమ్మరంగా బడిబాట
- తుది దశకు చేరుకున్న కార్యక్రమాలు

2 లో

పెద్దపల్లి బ్యూరో, ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తయారు చేసేందుకు ప్రభుత్వము ఎన్నో చర్యలను తీసుకుంటుంది. ఇప్పటికే మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేస్తూ ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందిస్తూ, యూనిఫామ్ పంపిణీ చేస్తూ, బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తూ విద్యార్థుల సంఖ్య పెంపుకు ప్రభుత్వము, విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే బడిబాట కార్యక్రమాన్ని మే 14న ప్రారంభించారు. ఈనెల 19 తో బడిబాట ముగియనుంది. బడిబాట సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పించటమే ఈ కార్యక్రమ ఉద్దేశం. పాఠశాలలు సోమవారం పున ప్రారంభం కాగానే బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు మరింత వేగవంతం చేశారు.

### ప్రజా ఉద్యమంగా ప్రజాపాలన ప్రగతి

# ప్రణాళిక విజయవంతం

**ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం**

**1.78 లక్షల మంది రైతులకు రూ.131 కోట్ల రైతు భరోసా**

**38,417 కొత్త రేషన్ కార్డులు..**

**1.71 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి**

**7,680 ఇందిరమ్మ ఇళ్లకు అనుమతులు..**

**1,146 ఇళ్ల నిర్మాణం పూర్తి..**

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** ప్రజా ఉద్యమంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జగిత్యాల జిల్లా లో గత 99 రోజులుగా అభివృద్ధి, సంక్షేమం, ప్రజా చైతన్య కార్యక్రమాలకు వేదికగా మంత్రి నుంచి సర్పంచ్ , వార్డు మెంబర్ ప్రజలు వరకు, గ్రామ కార్యదర్శి నుంచి అధికారుల వరకు అందరీ భాగస్వామ్యంతో విజయవంతంగా పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక. కార్యక్రమం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి శాసనసభ నియోజకవర్గాల్లో విజయవంతంగా అమలై ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పును తీసుకువచ్చిందని చెప్పవచ్చు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచనలు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పర్యవేక్షణలో గ్రామ, మండల, మున్సిపల్, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, అధికారులు, స్వయం సహాయక సంఘాలు, రైతు సంఘాలు, యువజన సంఘాలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను ప్రజా ఉద్యమంగా మార్చారు.

### రైతు సంక్షేమానికి పెద్ద పీట

వ్యవసాయమే జగిత్యాల జిల్లా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలు 99 రోజుల కార్యక్రమంలో విస్తృతంగా ప్రజలకు చేరాయి. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కలిపి 1,78,489 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.131 కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించారు. 275 రైతు బీమా క్లెయిమ్‌లను పరిష్కరించి రూ.13.01 కోట్ల ఆర్థిక సహాయాన్ని రైతు కుటుంబాలకు అందజేశారు.రైతు వారోత్సవాల్లో భాగంగా రైతు వేదికల్లో ఆధునిక వ్యవసాయం, సేంద్రియ సాగు, పంటల వైవిధ్యకరణ, నీటి యాజమాన్యం, మట్టి పరీక్షలు, వ్యవసాయ యాంత్రీకరణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

### సంక్షేమ పథకాలతో లక్షలాది కుటుంబాలకు భరోసా

జిల్లాలో 38,417 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి వేలాది కుటుంబాలకు ఆహార భద్రత కల్పించారు. మహాలక్ష్మీ పథకం కింద 1,61,896 మంది మహిళలు అర్హులుగా గుర్తించబడ్డారు. 55,65,913 గ్యాస్ సిలిండర్లకు రూ.22.42 కోట్ల సబ్సిడీ అందించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 7,680 ఇళ్లకు అనుమతులు మంజూరు చేయగా, 6,370 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పటికే 1,146 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. గృహజ్యోతి పథకం కింద 1,71,437 కుటుంబాలకు రూ.147.49 కోట్ల ప్రయోజనం అందింది.

### యువత భవిష్యత్తుకు బలమైన పునాది

నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఎ టి సి ఏ స్) ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. జగిత్యాల ఏటీసీలో సీఎన్‌సీ లాథ్ మెషిన్ ఆపరేషన్, ప్రోగ్రామింగ్, ఆటోమేషన్, రోబోటిక్ వెల్డింగ్, ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ, ఆటో సి ఏ డి డిజైనింగ్ వంటి కోర్సులను ప్రారంభించి యువతకు ఆధునిక నైపుణ్యాలు అందిస్తున్నారు. జిల్లాలో రెండు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జగిత్యాలలో రూ.200 కోట్ల వ్యయంతో పాఠశాల పనులు పురోగతిలో ఉండగా, ధర్మపురిలో మరో పాఠశాలకు పరిపాలనా అనుమతులు లభించాయి.

### పరిశ్రమలు.. ఉపాధి అవకాశాలు

జిల్లాలో 14 పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు నమోదయ్యాయి. వాటి ద్వారా రూ.9.59 కోట్ల పెట్టుబడులు, 129మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

### పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో పరిశుభ్రత కార్యక్రమాలు ప్రజల్లో విశేష స్పందన పొందాయి. గ్రామాలు, పట్టణాల్లో శ్రమదానం కార్యక్రమాలు నిర్వహించి కాలువలు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ప్లాస్టిక్ నిర్మూలన, వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, కార్యాలయ నిర్వహణ, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు స్వయంగా శ్రమదానంలో పాల్గొనడం విశేషంగా నిలిచింది.

### హరిత జగిత్యాల దిశగా

పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా భారీ స్థాయిలో మొక్కలు నాటారు. నీటి వనరుల పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 5 కే రన్ కార్యక్రమాలు వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విశేష చైతన్యాన్ని తీసుకువచ్చాయి.

### మహిళా సాధికారతకు కొత్త బలం

మహిళా సంక్షేమ వారోత్సవాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక స్వావలంబన, బ్యాంకు లింకేజీలు, సూక్ష్మ వ్యాపారాలు, డిజిటల్ లావాదేవీలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.“సేఫ్ మదర్స్ డే” కార్యక్రమాల ద్వారా గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు, పోషకాహార మార్గదర్శకాలు అందించారు. ధర్మపురి నియోజకవర్గంలో అర్హత గల మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేపట్టారు.

### విద్య, యువత, సామాజిక చైతన్యానికి ప్రత్యేక కార్యక్రమాలు

విద్యా వారోత్సవాల్లో సైన్స్ ప్రదర్శనలు, క్విజ్ పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మపురి నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, సైబర్ భద్రత, ఓటరు చైతన్యం, బాల్య వివాహాల నిరోధం, మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

### 99 రోజుల ప్రగతి... జగిత్యాల జిల్లాకు కొత్త గుర్తింపు

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల గడప దాకా చేరాయి. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, విద్యా వికాసం, యువత నైపుణ్యాభివృద్ధి, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక చైతన్యం వంటి అనేక రంగాల్లో జిల్లా ముందడుగు వేసింది. మంత్రి నుంచి గ్రామ సర్పంచ్ వార్డు మెంబర్ వరకు, ప్రజా ప్రతినిధుల నుంచి సాధారణ ప్రజల వరకు, అధికారుల నుంచి స్వచ్ఛంద సంస్థల వరకు అందరి భాగస్వామ్యంతో సాగిన ఈ 99 రోజుల ప్రణాళిక జగిత్యాల జిల్లాలో ప్రజా భాగస్వామ్య పాలనకు చిరస్మరణీయ ఉదాహరణగా నిలిచింది.

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలును వేగవంతం చేసిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి వంటి సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజల, అధికారుల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకంగా ప్రజలకు అందుతున్నాయని పేర్కొన్నారు. యువత నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. తెలంగాణను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కీలక పాత్ర పోషించిందని మంత్రి అన్నారు.

### జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్.

జగిత్యాల నియోజకవర్గంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా విస్తృత చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. రైతులకు ఆర్థిక భరోసా, మహిళలకు సంక్షేమ పథకాలు, పేదలకు గృహాల నిర్మాణం వంటి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

“ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను జగిత్యాల జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, అవగాహన కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాల సాధనకు కృషి చేశామని చెప్పారు.జిల్లాలో రైతు భరోసా, రైతు బీమా, మహాలక్ష్మి,గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాల అమలులో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉంటుందని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతం కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం

**బడిబాటపై ఫోకస్.. ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం**

**అధికారుల ఆదేశాలతో ముమ్మరంగా బడిబాట**

**తుది దశకు చేరుకున్న కార్యక్రమాలు**

**పెద్దపల్లి బ్యూరో, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తయారు చేసేందుకు ప్రభుత్వము ఎన్నో చర్యలను తీసుకుంటుంది. ఇప్పటికే మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేస్తూ ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందిస్తూ, యూనిఫామ్ పంపిణీ చేస్తూ, బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తూ విద్యార్థుల సంఖ్య పెంపుకు ప్రభుత్వము, విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే బడిబాట కార్యక్రమాన్ని మే 14న ప్రారంభించారు. ఈనెల 19 తో బడిబాట ముగియనుంది. బడిబాట సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పించటమే ఈ కార్యక్రమ ఉద్దేశం. పాఠశాలలు సోమవారం పున ప్రారంభం కాగానే బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు మరింత వేగవంతం చేశారు. గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలు, విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయడంతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల, మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో సౌకర్యాలను సైతం కల్పించారు. దెబ్బతిన్న భవనాల మరమ్మతులను జరిపిస్తున్నారు. ప్రస్తుతము ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అంతగా లేదు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నారు. తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల నుండి ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పై ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు పంపడం జరిగింది. దీంతో ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. ప్రైవేటు విద్యాసంస్థలు దోపిడీకి గురి చేస్తున్నాయని, లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కార్పొరేటు విద్యాసంస్థల్లో చదివించే దానికంటే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నందున తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు కూడా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించి ప్రతి పాఠశాలలో 20 పైచిలుకు విద్యార్థులను చేర్పించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఒక్క పాఠశాల మూతపడకుండా నడపాలని ప్రభుత్వము దృఢ సంకల్పంతో ఉంది. ఒక్కసారి పాఠశాల మూతపడితే తిరిగి పున ప్రారంభించడం కష్టం. ఈ నేపథ్యంలోనే అధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు బడిబాట ద్వారా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించి బడులు మూతపడకుండా తమ పోస్టులను కాపాడుకుంటున్నారు. బడులు మూతపడితే అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు వేరే చోటికి బదిలీ లేదా డిప్యూటేషన్ పై వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రతిరోజు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య విషయమై ఉన్నతాధికారులు తెలుసుకుంటున్నారు. గత సంవత్సరం బడిబాట ద్వారా మంచి ఫలితాలను సాధించిన నేపథ్యంలో ఈ సంవత్సరం కూడా బడిబాటను నెలకు పైగా చేపట్టారు. ఆశించిన ఫలితాలను రాబడుతున్నారు. ఈనెల 19 బడిబాట ముగియనున్నందున ప్రచారాన్ని ఉపాధ్యాయులు మరింత వేగవంతం చేశారు. గ్రామాల్లో ర్యాలీలు చేపడుతున్నారు. సోమవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఇందులో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేశారు. యూనిఫామ్ రాకపోవడంతో కొంత ఆలస్యం జరగనుంది. ఇది ఇలా ఉండగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విపరీతంగా ఫీజులను వసూలు చేస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలువురు రాజకీయ పక్షాల, విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వానికి విన్నవించడంతో అధిక ఫీజుల నియంత్రణకు కమిటీని ఏర్పాటు చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడి నియంత్రించే చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు సైతం పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తుండడంతో విషయం ప్రభుత్వానికి చేరడంతో నిఘా పెట్టింది. అధిక ఫీజుల నియంత్రణకు కమిటీని ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జిల్లాస్థాయిలో విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టే దిశగా అడుగులు వేస్తున్నారు.

# జాతీయ కరాటేలో తెలంగాణకు 11 పతకాలు



గోదావరిఖని ,ప్రభాతవార్త:

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఈ నెల 4 నుంచి 7 వరకు కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్-2026లో తెలంగాణ క్రీడాకారులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో పాల్గొన్న రాష్ట్ర జట్టు మొత్తం 11 పతకాలు సాధించి విశేష ఫలితాలు నమోదు చేసింది. సబ్‌జూనియర్, క్యాడెట్, జూనియర్ విభాగాల్లో జరిగిన పోటీల్లో ఏ. విశాల్‌రెడ్డి (16-17 ఏళ్లు, 61 కేజీలు) స్వర్ణ పతకం, ఎం. సహస్ర (12 ఏళ్లు, 35 కేజీలు) స్వర్ణ పతకం సాధించారు. బి. సత్యతేజ (16-17 ఏళ్లు, +66 కేజీలు), ఏ. మండోల్ (11 ఏళ్లు, 45 కేజీలు), బి. భార్గవ్ మానస (7 ఏళ్లు, 25 కేజీలు), వి. మోక్ష (9 ఏళ్లు, 30 కేజీలు) రజత పతకాలు గెలుచుకున్నారు. అలాగే టి. ఆరాధ్య (కటా, 14-15 ఏళ్లు), ఎల్. విద్యావత్‌రెడ్డి (9 ఏళ్లు, 35 కేజీలు), సుముక్‌రెడ్డి (కటా, 7 ఏళ్లు), జె. నక్స్ (7 ఏళ్లు, 45 కేజీలు), కే. రుత్విక్ (12 ఏళ్లు, 40 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. తెలంగాణ రాష్ట్రం తరఫున జాతీయ స్థాయిలో తొలిసారిగా 11 పతకాలు సాధించడం గర్వకారణమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్యాల రామస్వామి తెలిపారు. విజేతలైన క్రీడాకారులు, కోచ్‌లను తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర కరాటే క్రీడాభివృద్ధికి ఈ విజయం మరింత ప్రోత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

# పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలి

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:



పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టాలని పెద్దపల్లి జోన్ డీసీపీ బి.రామ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం గోదావరిఖని డివిజన్ పరిధిలోని గోదావరిఖని రెండు టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కు గోదావరిఖని రెండు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్‌రావు, లింగమూర్తి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం రిసెప్షన్, స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. తదుపరి స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ పరిధిలో అధికంగా నమోదవుతున్న నేరాల స్వరూపం, రౌడీ షీటర్ల వివరాలు, అనుమానితుల ప్రస్తుత పరిస్థితులు గురించి ఆరా తీశారు. స్టేషన్‌వారీగా బ్లూ కోల్ట్స్ సిబ్బంది పనితీరు, వారి విధుల నిర్వహణ సమయాలను కూడా తెలుసుకున్నారు. అనంతరం డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ షీటర్ల నివాసాలను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని సూచించారు. సైబర్ నేరాలు, క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల ప్రాముఖ్యత, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, మత్తు పదార్థాల నియంత్రణకు నిరంతరం కృషి చేయాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అత్యంత అవసరమని స్పష్టం చేశారు.

## మొక్కలు నాటిన బిజెపి నాయకులు



జూలపల్లి,ప్రభాతవార్త:

మోదీ జీ 12 సంవత్సరాల సుపరిపాలనలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం మండల కేంద్రంలో బీజేపీ అధికారం లోకి వచ్చి మోదీ జీ ప్రధానిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కాలాన్ని సుపరిపాలన కాలంగా వర్ణిస్తూ జూలపల్లి మండల కేంద్రంలో మోదీ జీ 12 సంవత్సరాల సుపరిపాలన కార్యక్రమాల ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తీగల అశోక్ ఆధ్వర్యంలో జూలపల్లిలోని గ్రామ పంచాయితీ ఆవరణంలో శివాలయం దగ్గర మొక్కలను నాటారు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి,వ గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, అమరగని ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చెప్పాటిన అభివృద్ధి కార్యక్రమాల వలన దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతుందని మోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త మీద ఉన్నదని ప్రతి వ్యక్తి కేంద్ర ప్రభుత్వ పథకాలలో ఏదో ఒకటి అనుభవిస్తు అభివృద్ధి చెందుతున్నారని తెలియకజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల మహేష్,దావు సంపత్ రెడ్డి, బడుగు శ్రీనివాస్,సంపత్,లక్కకుల రమేష్,మల్లెత్తుల అంజి యాదవ్, పెసరు రాజు,పెద్దోళ్ల ఐలయ్య,దాడి రవీందర్,దొడ్ల రాజి రెడ్డి,నాగుల అన్వేష్,కోడూరు రాజేశ్వర్,నల్ల గంగారెడ్డి,కొక్కుల భద్రయ్య,మడ్డి నాగరాజు,నగునూరు సురేష్ పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా క్రీసెంట్ బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల నిర్వహణ

పెద్దపల్లి, ప్రభాతవార్త:



నిబంధనలకు విరుద్ధంగా పెద్దపల్లిలో క్రీసెంట్ బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల నడుస్తోందని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స దా న ం ద ం ఆరోపించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో కళాశాల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పల్లె సదానందం మాట్లాడుతూ అనుమతి మేరకు పట్టణంలోనే కొనసాగాల్సిన కళాశాలను వేరేచోటికి మార్చినారని, ఇటీవల పత్రికల్లో కథనాలు రావడంతో తిరిగి పెద్దపల్లిలోని క్రీసెంట్ పాఠశాల ప్రాంగణంలోకి తీసుకువచ్చారని తెలిపారు. నిబంధనల ప్రకారం కళాశాలను ఒక ప్రాంగణం నుండి మరో ప్రాంతానికి తరలించడానికి అనుమతి లేదన్నారు. కళాశాలలో ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబొరేటరీ, సైకాలజీ ల్యాబొరేటరీ, లాంగ్వేజ్ ల్యాబొరేటరీ, మెథడాలజీ ల్యాబొరేటరీ, సరిపడా గ్రంథాలయం లేదన్నారు. ప్రతి సెమిస్టర్‌కు కనీసం 100 రోజుల తరగతులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ వాస్తవ పరిస్థితుల్లో తరగతులు జరగడం లేదని వివరించారు. నకిలీ హాజరు రికార్డులు నిర్వహించడం, హాజరు లేకుండానే పరీక్షలకు అనుమతించడం, టీచింగ్ ప్రాక్టీస్ కేవలం కాగితాలకే పరిమితం కావడం, రికార్డుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి కళాశాలపై ప్రత్యేక కమిటీతో సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల నుండి వసూలు చేసిన అక్రమ రుసుములను తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.




## డీజిల్ దొంగల పై కేసు నమోదు..

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండలము కోర్కల్ మానేరు వాగు ఇసుక రీచ్ లో మిషన్ ఆపరేటర్ గత నెల రోజుల నుండి ఆపరేటర్ నిర్భయ కుమార్ కోర్కల్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు విక్రయిస్తుండగా ,గత కొద్ది రోజులుగా డీజిల్ సరాసరి వినియోగం పై అనుమానం వచ్చిన క్వారీ ఇంచార్జి రవి ఆపరేటర్ పై నిఘా పెంచి సోమవారం ఉదయం ఆపరేటర్ విక్రయిస్తుండగా కొనుగోలు దారులను పట్టుకునేందుకు వెళ్లగా పరారైనట్లు ఫిర్యాదు తెలిపాడు. అతని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

## పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ఎద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:



ప్రజావాణి ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టప్రకారం వేగవంతంగా పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, చట్టప్రకారం వాటిని వేగవంతంగా పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. ఫిర్యాదులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అందిన ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ నిరంతరం కృషి చేస్తోందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరిపాలన కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఏడాదిన్నరలోగా పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి

పెద్దపల్లి, ప్రభాతవార్త:

ఏడాదిన్నరలోగా పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు తెలిపారు. సోమవారం పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను రోడ్లు భవనాల శాఖ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన బైపాస్



రోడ్డు నిర్మాణం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో రైతులు సహకరిస్తుండటం అభినందనీయమని, భూసేకరణ ప్రక్రియకు సంబంధించి అధికారులు త్వరలోనే నోటీసులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించాల్సిన అవసరం ఉండదని, దీంతో ట్రాఫిక్ సమస్యతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. పెద్దపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మించాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నప్పటికీ గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి 80 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించామని వెల్లడించారు. ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి బొద్దుల గంగయ్య, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్, రోడ్లు భవనాల శాఖ అధికారులు, కౌన్సిలర్లు దొడ్డుపల్లి జగదీశ్, అమ్రేష్, కాంగ్రెస్ నాయకులు మందల సత్యనారాయణరెడ్డి, ఆరె సంతోష్, కట్కూరి సుధాకర్‌రెడ్డి, అరుకుటి సంతోష్, కారింగుల రమేష్, పూదరి మహేందర్, ఒడ్నాల రమేష్, తిర్రి రాజు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా గిన్నెల శ్రీకాంత్ నియామకం

కోరుట్ల, ప్రభాతవార్త :

బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వై. అనూప్ రావు నివాసంలో కోరుట్లకు చెందిన బీజేపీ నాయకుడు గిన్నెల శ్రీకాంత్ ని బీజేపీ జగిత్యాల జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమిస్తూ నియామక పత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ గిన్నెల శ్రీకాంత్ బీజేపీ సీనియర్ నాయకుడు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కోరుట్ల పట్టణ బీజేపీ లో అత్యంత అక్టివ్ గా పార్టీకి సేవాలాందించాలని కోరుకుంటున్నా



మన్నారు. నూతనంగా నియామకం అయినా గిన్నెల శ్రీకాంత్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో జగిత్యాల జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యునిగా న నియామకానికి సహకరించిన మన ఇందూరు పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై. అనూప్ రావు లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు తుక్కారం గౌడ్, రాష్ట్ర నాయకుడు ఏలేటి నరేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు రుద్ర శ్రీనివాస్, జగిత్యాల జిల్లా కార్యదర్శి సుదవేణి మహేష్, కోరుట్ల బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, ఎర్ర రాజేందర్, మ్యాకల గణేష్, గందే నవీన్, మాడవేణి నరేష్, కోరుట్ల మండల అధ్యక్షుడు అంబల్ల సుదర్శన్, సంకు నరేందర్, బోలిశెట్టి రాజేందర్, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.




# బీర్‌పూర్ మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

బీర్ పూర్ ప్రభాత వార్త.



జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీల ఉపసర్పంచుల ముఖ్య సమావేశం సోమవారం నరసింహులపల్లి గ్రామంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి హాజరైన ఉపసర్పంచులు మండల స్థాయిలో తమ సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధిలో సమన్వయం, ప్రభుత్వ పథకాల అమలులో భాగస్వామ్యం వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా 'బీర్‌పూర్ మండల ఉపసర్పంచుల ఫోరం' నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం నూతన అధ్యక్షుడిగా దగ్గుల వీరేశం (మంగేళ), ఉపాధ్యక్షుడిగా నారపాక రమేష్ (ఇంద్రనగర్), ప్రధాన కార్యదర్శిగా తరల్ల మల్లేశం (కమ్మునూర్), కోశాధికారిగా జక్కుల నాగరాజు (కొల్వాయి), మరియు సలహాదారుగా శీలం లింగన్న (తుంగూర్) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సమావేశంలో పాల్గొన్న ఉపసర్పంచులు ఘనంగా అభినందించారు. అనంతరం నూతన అధ్యక్షుడు దగ్గుల వీరేశం మాట్లాడుతూ... మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఉపసర్పంచుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి తామంతా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అందరి సహకారంతో, సమిష్టిగా గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం శ్రమిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపసర్పంచులు పట్టం స్వర్ణలత, ఎనుగంటి జితేందర్, గంగధరి మల్లేష్, ఎనగంటి రమేష్, ఆసరి మహేష్, సంగ గంగన్న, కుడిమెత గంగారాం, సిరిపెల్లి సత్యవతి, చిక్రం అంజన్న తదితరులు పాల్గొన్నరని నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వీరేష్ తెలిపారు.

# అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమం

కొడిమ్యాల, ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా మల్యాల ప్రాజెక్టు పరిధిలోని కొడిమ్యాల సెక్టార్ సంద్రాలపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తద్వారా వారికి పౌష్టికాహారం, ప్రాథమిక విద్యతో పాటు సమగ్ర అభివృద్ధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. వార్డు సభ్యుడు వినోద్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు స్వర్ణ, సుధారాణి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి శ్రీ, ఆయా రాధ, తల్లిదండ్రులు జలంధర్, లహరి తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ కు షాక్

## కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్ యూత్ నాయకులు

కొడిమ్యాల, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన భారాస యూత్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎండీ సల్మాన్ తన అనుచరులతో కలిసి సోమవారం రోజున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషికి ఆకర్షితుడై కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. కొడిమ్యాల మండలంలోని ఎలికే గార్డెన్‌లో నిర్వహించిన బీఎల్ఏ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సల్మాన్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇస్తున్న ప్రాధాన్యత తనను ఆకట్టుకుందని చెప్పారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం శంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగభూషన్ రెడ్డి, కొడిమ్యాల సర్పంచ్, జిల్లా సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షులు గడ్డం జీవన్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ మహిపాల్ రెడ్డి, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేశ్, ప్యాక్స్ చైర్మన్ కొడిమ్యాల రాజనర్సింగరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిల్లల భవిష్యత్తుకు అంగన్వాడి తొలి మెట్టు..

## సూపర్వైజర్ సుధారాణి

కొడిమ్యాల, ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పూడూరు గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో సోమవారం అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ సుధారాణి మాట్లాడుతూ 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు ఆటలు, పాటల ద్వారా నాణ్యమైన ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందజేస్తున్నామని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అంగన్వాడి టీచర్లు సురేఖ, వసంత, పద్మ, స్నేహలత, పుష్పలత, ఆయా శారద, గ్రామానికి చెందిన తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



# లింగంపేటలో ప్రైవేట్ స్కూల్ వాహనాల నిషేధ నిర్ణయం

భీమారం, ప్రభాతవార్త:



భీమారం మండలంలోని లింగంపేట గ్రామ పంచాయతీ పాలకవర్గం గ్రామంలోని పిల్లలందరూ స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలని కోరుతూ సోమవారం రోజున ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం క్యాన్వాసింగ్ చేయవద్దని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల వాహనాలను గ్రామంలోకి అనుమతించబోమని, క్యాన్వాసింగ్ కోసం వచ్చిన బస్సులను అడ్డుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు. విద్యావేత్తల అభిప్రాయం ప్రకారం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం అవసరమే అయినప్పటికీ, ఇతర విద్యాసంస్థలపై ఆంక్షలు విధించడం కంటే ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు, మంచి ఫలితాలు అందించడం ద్వారా తల్లిదండ్రుల విశ్వాసాన్ని పొందడం మరింత సమర్థవంతమైన మార్గమని చెబుతున్నారు.

# ప్రజావాణిలో 10 ఫిర్యాదులు

కోరుట్ల, ప్రభాతవార్త :



పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో కోరుట్ల డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమము ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి యల్. జీవాకర్ రెడ్డి మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ డివిజన్ కేంద్రంతో పాటు డివిజన్ లోని పలు మండలాల నుండి ప్రజల సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వచ్చారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 10 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీవో కే.ధనలక్ష్మి శ్రీ, ఏఈఈ బి. లక్ష్మీ శ్రీకాంత్ వివిధ శాఖల జిల్లా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ మాట అంగన్వాడి బాట

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలోని భీముని దుబ్బ, హాజీపుర ఫస్ట్ సెకండ్ థర్డ్ అంగన్వాడి కేంద్రాలలో సోమవారం అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాలను శుభ్రపరిచి, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అంగన్వాడి కేంద్రాలలో ఉచిత విద్య, ఆటపాటలతో విద్య ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ప్రతిరోజూ అంగన్వాడి కేంద్రాలకు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. స్థానిక కౌన్సిలర్ సోగ్రబి, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనిత, అంగన్వాడి టీచర్లు హిమగిరి, రాజమణి, సంగీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడిని అరికట్టాలి

జగిత్యాల టౌన్ ప్రభాత వార్త..



ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలనీప్రజావాణిలో స్థానిక కలెక్టర్ కు బిజెపి సీనియర్ నాయకులు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థలైన స్కూల్స్ కాలేజీ యజమాన్యాల దోపిడి మితిమీరి పోయిందని అనుమతులు ఉన్న స్కూల్స్ కొన్ని అయితే అనుమతి లేని స్కూళ్లను కూడా నడిపిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడికి గురి చేస్తున్నారనీ, ప్రైవేట్ స్కూల్స్ కాలేజీలలో కనీస వసతులు అయిన పార్కింగ్ ఆట స్థలాలు లేకపోగా ఇరుకు గదుల్లో సామర్థ్యానికి మించి ఎక్కువమంది విద్యార్థులను కూర్చోబెడుతూ విద్య బోధన చేస్తున్నారన్నారు. అంతేకాకుండా విద్యార్థలకు అవసరమయ్యే బుక్స్ షూస్ డ్రెస్సెస్ మొదలైన వాటికి అధిక ధరలను నిర్ణయించి తమ పాఠశాలలోనే కొనాలని షరతు విధిస్తున్నారన్నారు. ర్యాంకులు మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచడం వల్ల విద్యార్థులు మానసికంగా కృంగుబాటుకు గురవుతున్నారనీ ఇలా అనేక లోపాలున్నప్పటికీ అధికారులు ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలతో చాటుమాటు వ్యవహారాలు సాగించడం వల్ల వారి ఆగడాలను నివారించేవారు లేకుండా పోతున్నారన్నారు. కాబట్టి ఎదిగే పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడిని అరికట్టే విధంగా ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్లు ఏసీ ఎస్ రాజు సిపెల్లి రవీందర్ కౌన్సిలర్ లింగంపేట శ్రీనివాస్ 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి శ్రీ ఆన్ కార్ సుధాకర్ చీటి చంద్రశేఖర రావు జువ్వాడి శ్రీకాంత్ రావు ఠాకూర్ కిషోర్ సింగ్ ఎర్ర శీను ప్రమోద్ గౌడ్ ఎండి సుమీర్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి డాన్స్ కాంపిటీషన్లో జిల్లా బాలికకు ద్వితీయ బహుమతి

జగిత్యాల టౌన్ ప్రభ వార్త :



సికింద్రాబాద్లోని హరిహర కళాభవన్లో సినిమా కొరియోగ్రాఫర్ జి శంకర్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నువ్వా నేనా అనే టైటిల్ తో డాన్స్ కాంపిటీషన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి డాన్సర్లు పాల్గొని తమ ప్రతిభను చాటారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎన్.డి.ఎస్ డాన్స్ అకాడమీ నుంచి మోళి ఠాకూర్ సీనియర్ సోలో వెస్టర్న్ క్యాటగిరిలో పాల్గొని ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలికకు మెమొంటోను, నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో ఫేమస్ సినిమా కొరియోగ్రాఫర్లు జానీ మాస్టర్, నగేష్, కృష్ణ జగిత్యాలకు చెందిన ఎన్.డి.ఎస్ డాన్స్ అకాడమీ మాస్టర్లు మణిదీప్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## స్కాట్ మాస్టర్ ఉద్యోగాలకై దరఖాస్తులు

జగిత్యాల టౌన్ ప్రభాత వార్త.. జగిత్యాల జిల్లా పరిధిలోని వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న స్కాట్ మాస్టర్ల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కమిషనర్ పేరం మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ది స్కాట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజేషన్లో సేవలందించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 17వ తేదీ నుండి ప్రారంభమై, 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను జగిత్యాల ధర్మపురి రోడ్డులోని ఎస్.కె.ఎన్.ఆర్ ప్రభుత్వ కళాశాల సమీపంలో గల సన్రైజ్ పశువుల దాణా షాప్ పై అంతస్తులో ఉన్న జిల్లా కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని నిబంధనలు విధించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు 15,000 రూపాయల గౌరవ వేతనం అందించనున్న ట్లు కమిషనర్ వెల్లడించా రు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# యావర్ రోడ్డు విస్తరణ త్వరగా చేపట్టాలి

### ఎమ్మెల్యే కాలయాపన చేస్తున్నారు

### గతంలో నేను రోడ్డును

### 60 ఫీట్లకు విస్తరించిన

### మాజీ మంత్రి జీవన్ రెడ్డి



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

యావర్ రోడ్డు విస్తరణ వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాలయాపన చేయడం సరికాదని మాజీ మంత్రి బి ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి పేర్కొన్నారుజగిత్యాల జిల్ల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు అధికార పక్ష తీరును తీవ్రంగా ఎండగట్టారు. ఈ సమావేశంలో జగిత్యాల జెడ్పీ తొలి మాజీ ఛైర్పర్సన్ దావ వసంత సురేష్, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి శ్రీ దేవేందర్ రెడ్డి, మాజీ చైర్మన్ దేశాయ్, పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర రావుతో పాటు పలువురు కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం నాయకులంతా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తరలివెళ్లి, యావర్ రోడ్డు అక్రమ నిర్మాణాలు, విస్తరణ మందగమనంపై జిల్లా కలెక్టర్కు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ యావర్ రోడ్డు విస్తరణ అంశంపై స్థానిక ఎమ్మెల్యే ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. 1994లోనే ఈ రోడ్డును 60 ఫీట్లకు విస్తరించేందుకు మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందిందని, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో అందరినీ ఒప్పించి 40 ఫీట్ల రోడ్డును 60 ఫీట్లకు విస్తరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తర్వాత రాబోయే అవసరాల దృష్ట్యా 100 ఫీట్ల రోడ్డుగా మార్చాలని మున్సిపల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించినప్పటికీ, అది కేవలం ప్రచారాలకే పరిమితమైందని ఆక్షేపించారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా, కలెక్టర్ ఆదేశాల మేరకు విస్తరణ పనులకు వంద కోట్ల రూపాయలు అవసరమవుతాయని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారని తెలిపారు. ఈ నివేదిక సమర్పించి దాదాపు 18 నెలలు గడుస్తున్నా పైసా నిధులు తీసుకురాలేకపోయారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ గత రెండేళ్లుగా తాను ముఖ్యమంత్రితో కలిసి నడుస్తున్నానని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికార పక్షంతో సాగుతున్నానని పదేపదే చెబుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎంతో అంతటి సాన్నిహిత్యం ఉన్న ఎమ్మెల్యేకు, జగిత్యాల నడిబొడ్డున ఉన్న రోడ్డు విస్తరణకు వంద కోట్ల నిధులు మంజూరు చేయించడం పెద్ద విశేషమేమీ కాదన్నారు. ఒకవైపు సీఎంకు అత్యంత ఆప్తుడిగా చలామణి అవుతూ, మరోవైపు మున్సిపల్ కమిషనర్ చుట్టూ తిరుగుతూ యావర్ రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ దాగుడు మూతలు, నాటకాలు ఎవరిని మోసం చేయడానికి అని ప్రశ్నించిన ఆయన, ఎమ్మెల్యే ద్వంద్వ విధానాలపై పట్టణ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేను దత్తత తీసుకుంటే, ఏకంగా పవర్ ఆఫ్ అటార్నీ ఏమైనా రాసిచ్చారా అని, ఇక్కడ ఏ కాంట్రాక్ట్ జరగాలన్నా, ఏ పని కావాలన్నా ఎమ్మెల్యే కనుసన్నల్లోనే జరగాలనే నిబంధన పెట్టారా అని నిలదీశారు. యావర్ రోడ్డుపై వెలిసిన అక్రమ కట్టడాల తొలగింపు విషయంలో అధికారులు, పాలకుల తీరు పక్షపాతంగా ఉందంటూ జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలు ఎక్కడైనా చిన్న స్థలం ఆక్రమిస్తే హైడ్రా బలగాలను పంపి కూల్చివేతలు చేపడుతున్న ప్రభుత్వం, ఇక్కడ కోట్ల విలువైన ప్రభుత్వ భూములను పెట్టుబడిదారులు ఆక్రమిస్తే ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. రోడ్డుపై అక్రమంగా నిర్మించిన భారీ భవనాలను తొలగించాలని తాను కలెక్టర్కు లేఖ రాసి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గతంలో తాము అక్రమ కట్టడాలపై ప్రశ్నిస్తే, ఇళ్లు కూల్చమంటున్నారంటూ తనపై బురదజల్లే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ధ్వంసం చేయాల్సింది పేదల ఇళ్లను కాదని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన పెద్దల భవనాలని స్పష్టం చేశారు. అక్రమార్కులను వదిలేసి, రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటూ పొట్టపోసుకునే చిన్న చిన్న వ్యాపారులపై అధికారులు ప్రతాపం చూపడం దుర్మార్గమన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 138 లో జరిగిన భూ కుంభకోణాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. సదరు సర్వే నెంబర్లో 20 గుంటల ప్రభుత్వ భూమిని గతంలో పెట్రోల్, డీజిల్, కిరోసిన్ అవుట్లెట్ ఏర్పాటు కోసం కేటాయిస్తే, అందులో కేవలం 4 గుంటల స్థలాన్ని మాత్రమే ఆ అవసరానికి వాడుతూ, మిగిలిన విలువైన భూమిని వాణిజ్య సముదాయాల కోసం అక్రమంగా వినియోగిస్తున్నారని ఆరోపించారు. గతంలో మున్సిపల్ చైర్మన్గా ఉన్న దేశాయ్ ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాలనే పట్టుదలతో మున్సిపల్ కౌన్సిల్లో తీర్మానం చేసి, ఆ భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని అప్పట్లో న్యాయస్థానం కూడా స్పష్టమైన తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. కిబాల ద్వారానే తాము ఆ ఆస్తిని పొందామని సదరు ఆక్రమణదారులు చెబుతున్నప్పటికీ, ఇంతవరకు దానికి సంబంధించిన ఒరిజినల్ పత్రాలు వెలుగులోకి రాలేదన్నారు. సదరు భూమికి ఎలాంటి టైటిల్ లేదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ, మున్సిపల్ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి నివాస గృహాల పేరిట అనుమతులిచ్చి, ఆపై వాటిని వాణిజ్య అవసరాలకు మార్చడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ అక్రమ వ్యవహారాలన్నీ జిల్లా కలెక్టర్ దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో న్యాయ సలహా కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసి ఆరు నెలలు గడుస్తున్నా, ఆ కమిటీ నివేదిక ఏమైందో, లీగల్ ఒపీనియన్ ఏం వచ్చిందో ఇంతవరకు బయటపెట్టకపోవడం శోచనీయమన్నారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను పట్టణ ప్రజలకు బహిర్గతం చేయాల్సిన కనీస బాధ్యత కలెక్టర్పై ఉందన్నారు. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న మున్సిపల్ స్థలాలు పరాయిపాలవుతుంటే స్థానిక శాసనసభ్యుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటం ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే ప్రాథమిక బాధ్యత అని, ఒకవేళ ఎమ్మెల్యేకు జగిత్యాల అభివృద్ధిపై, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించడంతో పాటు, యావర్ రోడ్డుపై ఉన్న అక్రమ కట్టడాలను, సర్వే నెంబర్ 138 లోని ఆక్రమణలను మున్సిపల్ శాఖ ద్వారా తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూబాధితులకు న్యాయం చేయాలి కలెక్టర్కు నేరెల్ల గ్రామస్థుల వినతి

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త..



జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెల్ల గ్రామంలో నిర్మిస్తున్న సమగ్ర వసతి గృహాల పాఠశాల భవన నిర్మాణాల వల్ల తాము జీవనోపాధి కోల్పోతున్నామని, తగిన న్యాయం చేయాలని కోరుతూ నేరెల్ల గ్రామానికి చెందిన అసైన్డ్ భూబాధిత నిరుపేద కుటుంబాలు సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించాయి. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, సుమారు 60 ఏళ్ల క్రితం నాటి ప్రభుత్వం తమ బ్రతుకుదెరువు నిమిత్తం సర్వే నెంబర్ 252 లో భూములను కేటాయించిందని పేర్కొన్నారు. తరతరాలుగా తమ పెద్దలు ఆ భూమిని ఎంతో కష్టపడి సాగు చేస్తూ జొన్న, కంది, మక్క, శనగ తదితర పంటలు పండిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నట్లు వివరించారు. సదరు భూమి కొంతమేర బండరాయితో కూడి ఉన్నందున ట్రాక్టర్లతో దున్నడానికి వీలుపడక, కొందరు సాగును తగ్గించినప్పటికీ ఎవరి హద్దుల్లో వారు గెట్లు వేసుకుని భూములను కాపాడుకుంటున్నామని తెలిపారు. అయితే, తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, పంటలు సాగు చేయడం లేదనే సాకుతో పాఠశాల నిర్మాణ పనులు చేపట్టడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడం పట్ల తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, కానీ పేదలకు కేటాయించిన భూములను లాక్కోవడం సరికాదన్నారు. ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని కలిసి తమ ఆవేదనను నివేదించగా, ఆయన సానుకూలంగా స్పందించి తమకు అన్యాయం జరగనివ్వనని హామీ ఇస్తూ, కలెక్టర్ను కలవాల్సిందిగా సూచించినట్లు బాధితులు తెలిపారు. మానవతా దృక్పథంతో ఆలోచించి ఆ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా తమకే ఉంచాలని, ఒకవేళ అది సాధ్యం కాకపోతే భూములు కోల్పోతున్న పేద కుటుంబాలకు చట్టప్రకారం తగిన నష్టపరిహారంతో పాటు ఉపాధి నిమిత్తం ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని వారు జిల్లా కలెక్టర్ను ప్రత్యేకంగా వేడుకున్నారు.

## కనిపించని ఆలమందలు - వ్యవసాయంలో తగ్గుతున్న సేంద్రియ ఎరువులు

**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :**

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు ఇంటి వద్ద ఆలమందలు (పశువుల మందలు) కనిపించేవి. వ్యవసాయానికి అవసరమైన పశువుల ఎరువు సమృద్ధిగా లభించేది. కానీ కాలక్రమేణా వ్యవసాయ యాంత్రీకరణ, పశుపోషణపై ఆసక్తి తగ్గడం, పశువుల మేత భూములు క్షీణించడం వంటి కారణాలతో ఆలమందలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. దీంతో వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల కొరత తీవ్రమవుతోంది. రసాయన ఎరువుల వినియోగం పెరగడంతో పశువుల ఎరువుల అవసరం తగ్గినప్పటికీ, ప్రస్తుతం నేల సారాన్ని కాపాడుకోవడానికి సేంద్రియ ఎరువుల ప్రాధాన్యం మరింత పెరిగింది. పశువుల సంఖ్య తగ్గడంతో రైతులకు పశువుల పేడ, కంపోస్ట్ ఎరువులు తగినంతగా అందడం లేదు. దీంతో అధిక ధరలకు సేంద్రియ ఎరువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, పశువుల ఎరువు నేలలో సేంద్రియ కార్బన్‌ను పెంచి, నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే పంటల దిగుబడులను స్థిరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ప్రస్తుతం రైతులు ఎక్కువగా రసాయన ఎరువులపై ఆధారపడటంతో నేల సారం తగ్గిపోతున్నట్లు ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆలమందల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రోత్సాహక పథకాలు



అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల్లో గోశాలల ఏర్పాటు, పశుపోషణకు సబ్సిడీలు, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు చేపడితే రైతులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యవసాయ భూముల సారాన్ని కాపాడుకోవాలంటే పశుసంపదను పెంపొందించడం, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం కాలానుగుణ అవసరంగా మారింది. ఒకప్పుడు గ్రామాలకు జీవం పోసిన ఆలమందలు మళ్లీ కనిపించే రోజులు రావాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మెట్‌పల్లి పట్టణ సుందరీకరణకు మరో అడుగు

### వేగంగా సెంట్రల్ రూఫ్ లైటింగ్ పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



**మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :** మెట్‌పల్లి పట్టణాన్ని మరింత అందంగా, ఆధునికంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న సుందరీకరణ పనుల్లో భాగంగా సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న రూఫ్ లైటింగ్ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి పరిశీలించారు. మున్సిపల్ అధికారులతో కలిసి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచిం చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, మెట్‌పల్లి పట్టణ అభివృద్ధికి మున్సిపాలిటీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పట్టణ సౌందర్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగానే పట్టణ నడిబొడ్డున ఉన్న సెంటర్‌లో లైటింగ్ స్తంభాల చుట్టూ ప్రత్యేక రూఫ్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాత్రి సమయంలో పట్టణానికి ఆకర్షణీయమైన రూపాన్ని తీసుకురావడంతో పాటు, వాహనదారులు, పాదచారులకు స్పష్టమైన వెలుతురు అందించే విధంగా ఈ లైటింగ్ వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో జరిగే రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, ట్రాఫిక్ నిర్వహణకు అనుకూలంగా ఉండేందుకు ఈ ఏర్పాట్లు దోహదపడతాయని అన్నారు. మెట్‌పల్లి పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే దిశగా మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని చైర్మన్ పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత, సుందరీకరణ అంశాల్లో రాజీ పడకుండా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, డీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ సానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించిన మండల విద్యాధికారి

**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :**

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాధికారి బండారి మధు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల నమోదు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. మండల విద్యాధికారి మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో అన్ని పాఠశాలల్లో పరిసరాలు, తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచే చర్యలు ఇప్పటికే చేపట్టినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే బియ్యంలో పురుగు పట్టిన ధాన్యాన్ని వాడకుండా పక్కన పెట్టి, నాణ్యమైన బియ్యంతోనే వంటలు తయారు చేయాలని సూచించారు. అలాగే వంట పాత్రలను శుభ్రపరిచిన తర్వాతే వినియోగించాలన్నారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే సిబ్బంది తప్పనిసరిగా తలకు అప్రాన్, చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కులు ధరించాలని ఆదేశించారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అన్ని పాఠశాలలకు చేరుకున్నందున పాఠశాలలు ప్రారంభమైన తొలి రోజుల నుంచే విద్యార్థులకు పంపిణీ చేయాలని తెలిపారు. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు (ఎన్రోల్మెంట్) గత ఏడాదితో పోలిస్తే కనీసం 20 శాతం పెరిగేలా కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న లేదా కూల్చివేయాల్సిన తరగతి గదులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అడ్మిషన్ పొందిన విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు యుడిఐఎస్ ఈ ప్లస్‌లో



నమోదు చేయడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల సమాచారాన్ని నవీకరించాలని సూచించారు. టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్ వివరాలను ఐ ఎస్ ఎం ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. గత విద్యా సంవత్సరంలో మాదిరిగానే ఎఫ్ ఎల్ ఎస్, ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులకు అనుమతి ఉన్నందున చిన్నారుల నమోదు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సీఆర్పీలు రవీందర్, రాజేందర్, శివరాం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కార్తీక్, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు అభివృద్ధికై ప్రజావాణి లో పిర్యాదు

**మెట్‌పల్లి, ప్రభాతవార్త:** పట్టణంలోని 2వ వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని వార్డు ప్రజలు ప్రజావాణి లో ఆర్డీవో నర్సింహారావు కు సోమవారం వినతిపత్రం అందచేశారు. ఇందులో భాగంగా వార్డులో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, డ్రైనేజి నిర్మాణాలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఇషాక్, పాషా, రహమాన్ లు పిర్యాదు లో పేర్కొన్నారు.

# మెట్‌పల్లి వార్త



## వెంకట్రావుపేటలో షాపింగ్ కాంప్లెక్స్‌పై ప్రజావాణిలో ఫిర్యాదు

**మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:**

మెట్‌పల్లి పట్టణంలోని 12వ వార్డులోని వెంకట్రావుపేట ప్రాంతంలో మున్సిపల్ నిర్మాణ అనుమతులు లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారని ఆరోపిస్తూ మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల నరేష్, అంగడి పురుషోత్తం లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, వెంకట్రావుపేటలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఏషాల సుశీల షాపింగ్ కాంప్లెక్స్‌కు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతులు లేవని, అయినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే, కమర్షియల్ వ్యాపార అవసరాల కోసం నిర్మిస్తున్న ఈ కాంప్లెక్స్‌కు చట్టబద్ధమైన అనుమతులు లేకపోవడం వల్ల భవిష్యత్తులో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్ కు వారు విజ్ఞప్తి చేశారు.

## ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్న శ్రీనివాస్ కు సన్మానం

**మెట్‌పల్లి, ప్రభాతవార్త:**



ఇటీవల రాజమండ్రి ప్రపంచ తెలుగు మహాసభలో సొప్పరి శ్రీనివాస్ పాల్గొని సన్మానం పొందిన సందర్భంగా.. మండలంలోని బండా లింగాపూర్ పంచాయతీ పాలకవర్గం, జెడ్పిహెచ్ఎస్ బండలింగాపూర్ స్కూల్ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీనివాస్ కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ సంజీవ్, ఉప సర్పంచ్ రాకేష్, స్కూల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ ఇట్టెడి ప్రతాప్ రెడ్డి, వైస్ చైర్మన్ చిలుముల రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జితేందర్, మెట్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగిటి రాజేందర్, జంగ గంగ స్వామి, కూకట్ల రాజేందర్, గట్టయ్య, కూకట్ల భూమయ్య, బొల్లు శంకర్, రాచర్ల మేర విజయ్, ఇట్టెడి భూమరెడ్డి, శేఖర్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు..

## నితిన్ చారిటబుల్ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీల వితరణ .



**మెట్ పల్లి కల్చరల్, ప్రభాత వార్త:** మెట్ పల్లి కోర్టులో క్లయింట్ల వేయింటింగ్ కోసం ఏర్పాటు చేసిన నాలుగు సిమెంట్ బెంచీలను బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రామ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్లయింట్ల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకొని మీడియా షన్ కో ఆర్డినేటర్లు అయినా ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణు గోపాల్, పసునూరి శ్రీనివాస్ లు విషయాన్ని నితిన్ చారిట్రబుల్ ట్రస్ట్ కి సమాచారం అందించగా, ట్రస్ట్ వ్యవస్థాపకులు డా. రాణావేన సత్యనారాయణ వెంటనే స్పందించి బెంచీల్ని అందించినందుకు వారికి ధన్యవాదాలు చెప్పారు. క్లయింట్ల సౌకర్యార్థం బెంచీలు ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు గంద్ర ప్రవీణ్ రావు, పోలకొండ దయాకర్ వర్మ, గడ్డం శంకర్ రెడ్డి, బద్దం లక్ష్మారెడ్డి, వంగరి గంగరాజం, పులి నర్సయ్య, పుప్పాల లింబాద్రి, నేరెళ్ల శ్రీధర్, పడిగేల శ్రీనివాస్, మార్క వంశీ, గజేల్లి రాందాస్, అలాల శంకర్, కడారి యుగంధర్ తదితరులు ఉన్నారు.

# సిరిసిల్ల వార్త



## బాధితుల సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ డే

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త

: ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 24 ఫిర్యాదులు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు.ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి



బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.

## అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో అదనపు కలెక్టర్ దరఖాస్తులు 205 స్వీకరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ ప్రజావాణిలో డీఆర్ఓ జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## మొహరం ఏర్పాట్లు చేయాలి

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త



: మొహరం ఏర్పాట్లు ను పకడ్బందీగా చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులకు ఆదేశించారు . మొహరం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని వివిధ శాఖల అధికారులతో సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తన ఛాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ జిల్లాలోని అషూర్ ఖానాలలో పరిశుభ్రత పనులు చేయించాలని, విద్యుత్ దీపాలు, నీరు అందుబాటులో పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు కలుగకుండా ఏర్పాట్లు చేయించాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటి సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దిన్ , సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

నూతన విద్యా సంవత్సరం ప్రారంభ సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ లో స్థానిక 7 వార్డు కౌన్సిలర్ ఎర్రం వెంకట్రాజం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రుక్మిణి చేతుల మీదుగా ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా కౌన్సిలర్ వెంకట్రాజం మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల భాగ్యరేఖ, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




## ఆదర్శ పాఠశాల లో దరఖాస్తుల ఆహ్వానం

గంభీరావుపేట, ప్రభాతవార్త

:గంభీరావుపేట మండలం దమ్మనపేట ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన బోధించుటకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీలత సోమవారము ఒక ప్రకటనలో తెలిపారు. పిజిటి ఆంగ్లము, పిజిటి కామర్స్, టీజీటీ ఆంగ్లము ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. టీజీటీ సంబంధిత సబ్జెక్ట్ కు డిగ్రీ ఉత్తీర్ణత మరియు టెట్ క్వాలిఫై వారు అర్హులన్నారు. పిజిటి సంబంధిత సబ్జెక్ట్ లో పీజీ ఉత్తీర్ణత ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి సమాచారంతో సర్టిఫికెట్స్ జిరాక్స్ లు జతచేసి పాఠశాల లో ఇవ్వాల్సిందిగా కోరారు. డెమో తేదీ 19062026 రోజున ఉదయం 10 గంటల నుండి జరగనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన డీ ఈ ఓ

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

ఇల్లంతకుంట మండల కేంద్రముతో పాటు గాలిపెల్లి ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఉన్న వసతుల గూర్చి ఆరాదీశారు.పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.విద్యార్థుల సంఖ్య పెరిగేలా గ్రామాల్లో ఇంటింటికి తిరగి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులపై వివరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## రిజర్వాయర్ లో పడి బాలిక మృతి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలములోని అనంతగిరి అన్నపూర్ణ జలాశయములో పడి బాలిక మృతి చెందిన ఘటన అందరిని కలచి వేసింది.వివరాల ప్రకారం చిన్నకోడూరు మండలం రాముని పట్లకు చెందిన స్వాతి మహేష్ దంపతుల కుమార్తె కీర్తన(10)కుటుంబ సభ్యులతో కలిసి తిప్పాపూర్ గ్రామములో జరిగిన బోనాల జాతరలో పాల్గొన్నారని ప్రత్యక్ష సాక్షుల సమాచారం.అనంతరం సందర్శనార్థం వెళ్లి అన్నపూర్ణ జలాశయం వద్ద ఫోటోలు దిగుతుండగా ప్రమాద వశాత్తు నీటిని ఎత్తి పోసే గుంతలో పడటముతో వెంటనే బయటికి తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా,చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు.చిన్నారి మృతి పట్ల గ్రామములో విషాద ఛాయలు నెలకొన్నాయి.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణి



ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలములోని రేపాక గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సోమవారం పాఠ్య పుస్తకాలు అందించారు. పాఠశాల పునః ఆరంభం రోజు విద్యార్థులకు అందించడం సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయురాలు రేవతి పేర్కొన్నారు. నూతన విద్యా సంవత్సరములో కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరారెడ్డి,మల్లికార్జున్, రామేశ్వర రెడ్డి,అబ్రార్ హైమద్,మల్లయ్య,మాధవి,సుజాత,రాధారాణితో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పేరుకుపోయిన పూటిక ను తొలగించాలి

గంభీరావుపేట, ప్రభాతవార్త:



ఏళ్ల తరబడిగా ఎగువ మానేరు పేరుకుపోయిన పూటిక ను తొలగించి, తొమ్మిదవ ప్యాకేజీ పనులను పూర్తి చేయాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటు వేణు డిమాండ్ చేశారు. సోమవారము గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు అతిథి గృహంలో మానేరును బచావో కు శ్రీకారం చుట్టారు. వివిధ పార్టీ నాయకుల తో కలిసి సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు తరాల మనుగడకు నీటిని రక్షించుకునే విధంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగి 75 ఏళ్లు గడిచిన ప్రాజెక్టులో ఇప్పటివరకు కొనసాగిన ప్రభుత్వాలు తట్టెడు మట్టి తీయలేదని ఆరోపించారు. ప్రాజెక్టు నందు పూటిక పెరిగి, కాల్వల చిన్నాభిన్నంతో ఆయకట్టు విస్తరణ ప్రతి ఏటా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 21వేల ఏకరాల ఆయకకట్టు వరకు కాలువ పనులు పూర్తి చేయాలని, నక్క వాగు ప్రాజెక్టును ఎగువ మానేరు కు అనుసంధానం, నాలుగు జిల్లాల సరిహద్దుల్లో ఉన్న ప్రాజేక్ట్ ను పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, ప్రాజెక్టు నందు ఇచ్చిన భూములను వెనక్కి తీసుకోవాలని తీర్మానం ద్వారా డిమాండ్ చేశారు. పోరాటానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా రావాలని కోరారు. సమావేశంలో జిల్లా జేఏసీ చైర్మన్ కనకయ్య, ఎగువ మానేరు పరిరక్షణ సమితి కన్వీనర్ ఒరుగంటి తిరుపతి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు మదాల కుమార్ స్వామి, మార్వాడి సుదర్శన్, ఆడ్వకేట్ సాయి, ఎమ్మార్పీఎస్, టిఆర్ఎస్ నాయకులు దోసల చంద్రం, కూర సురేష్, మండల కన్వీనర్ మజార్, జిల్లా సాధన కమిటీ కన్వీనర్ వేణు, గౌస్ సోద్దీన్, రమేష్, వివిధ మండలాల నాయకులు ద్యాప దేవయ్య, బండారి బాల్ రెడ్డి, వెంకటి, పెద్ది శ్రీనివాస్ లతోపాటు తదితర నాయకులు పాల్గొన్నారు

## అట్ట పుట్టల వితరణ

గంభీరావుపేట, ప్రభాతవార్త:



గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి విద్యార్థులకు సోమవారము అట్టపుట్టల ను వితరణగా అందజేశారు. ఉప సర్పంచ్ హమీద్ సహకారంతో ప్రధానోపాధ్యాయులు చింతపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అట్ట పుట్టలను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల పక్షాన ఉప సర్పంచ్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోయన్న గారి నారాయణ, తాడూరి సంపత్ కుమార్, మారేపల్లి రాజు, గుడి కాడి కొమరయ్య, శనిగరం నారాయణ, అజ్మీర కవిత, జడల విజయ శ్రీ లతోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# సమాజంలో సమరసత భావాలను పెంపొందించాలి

**సామాజిక సమరసత వేదిక**

**రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్**



జగిత్యాల, బ్యూరో ప్రభాత వార్త:

సమాజంలోని అన్ని కులాలు వర్గాల మధ్య సమరసత భావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. సోమవారం జగిత్యాలలో జిల్లా సమరసతా వేదిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, వర్గ విభేదాల కారణంగా సమాజం బలహీనపడుతుందని, దీనిని ఆసరాగా చేసుకుని విదేశీ శక్తులు దేశాన్ని అస్థిరపరిచే అవకాశం ఉన్నందున సమాజంలో అన్ని వర్గాల మధ్య సమరసత భావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమాజంలో ఏ ఒక్క కులం గొప్పది, ఏ ఒక్క కులం తక్కువ కాదని సమాజ అవసరాల కోసం మాత్రమే కుల వ్యవస్థ ఏర్పడిందన్నారు. అయితే కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం కులం పేరుతో మతం పేరుతో వర్గం పేరుతో ప్రాంతం పేరుతో భాష పేరుతో సమాజాన్ని విడదీస్తున్నారని అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సమరసత వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఆకుతోట వెంకట రమణారెడ్డి, విభాగ్ కన్వీనర్ చిట్ల గంగాధర్, జిల్లా కన్వీనర్ సూర్యనారాయణ, కనికరం లచ్చన్న, వేదిక జిల్లా నాయకులు రవితేజ, భూమారెడ్డి, వంగల భాస్కరాచారి, పురుషోత్తం, రత్నయ్య చారి, లింగారెడ్డి, రవీందర్, రత్నయ్య, బొందుకూరి శ్రీనివాస్, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**పలు సమస్యలపై వినతులు**

**స్వీకరించిన జిల్లా**

**కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 71**




జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూపలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 71 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ అధికారి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.

## దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్ గడువు జూన్ 21 వరకు పొడగింపు

జగిత్యాల టౌన్ ప్రభాత వార్త:

డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్ల గడువు తేదీని జూన్ 21 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్లకు జూన్ 21 వరకు, వెబ్ ఆప్షన్ల నమోదుకు జూన్ 22 వరకు అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. జూన్ 25న సీట్ల కేటాయింపు (సీట్ అలాట్‌మెంట్) జరగనుండగా, సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 26 నుంచి జూలై 2 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. అలాగే దోస్త్ మొదటి, రెండో, మూడో విడతల్లో సీట్ల కేటాయింపు పొంది సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన విద్యార్థులు జూన్ 27 నుంచి జూలై 4 వరకు సంబంధిత కళాశాలలకు హాజరై ఒరిజినల్ ఇంటర్మీడియట్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టి.సి.)తో పాటు ఇతర విద్యార్హతల పత్రాల జిరాక్స్ కాపీలను సమర్పించి కళాశాలలో అడ్మిషన్ కన్ఫర్మేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. జూలై 6వ తేదీ నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయని ఆయన వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరానికి కళాశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన ఏఈడీపీ కోర్సులైన బీకాం (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్), బీఎస్సీ (హెల్త్ కేర్) కోర్సుల్లో ఇంకా సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ఇతర కోర్సుల్లో కూడా పరిమిత సంఖ్యలో సీట్లు మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. దోస్త్ గడువు పొడిగింపును విద్యార్థులు సద్వినియోగం చేసుకొని రిజిస్ట్రేషన్ పూర్తి చేయడంతో పాటు తమకు ఆసక్తి ఉన్న కోర్సులు, కళాశాలలకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, ఆధునిక మౌలిక సదుపాయాలతో కూడిన. ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం పొందేందుకు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ కోరారు.

## అంతర్గాం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్ పంపిణీ

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకుని జగిత్యాల మండలం రూరల్ అంతర్గాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింగు సత్తయ్య చేతులమీదుగా ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందిస్తున్న విద్యాసంబంధిత ఉచిత పథకాలను, రాయితీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత జీవన ప్రమాణాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. గడిచిన విద్యాసంవత్సరంలో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించి డివిజన్ లోనే అగ్రగామిగా నిలిచిందని. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు పాలిటెక్నిక్ లో, మరో విద్యార్థిని ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించడం అంతర్గాం పాఠశాల చరిత్రలోనే గర్వించదగ్గ విషయమన్నారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల వల్లే ఈ అద్భుత విజయాలు సాధ్యమయ్యాయని, రాబోయే రోజుల్లో అంతకంటే మిన్నగా ప్రతిభ కనబరిచి పాఠశాల కీర్తి పతాకాన్ని మరింత ఎత్తులో ఎగరేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు చీటి భూపతిరావు, బాలె సరోజ, ఎర్రోజు అనిత, మాడ రజనీకర్ రెడ్డి, భోగ రాజేందర్, ఫక్రుద్దీన్, శీలం శరత్, వ్యాయామ ఉపాధ్యాయుడు



# జగిత్యాల వార్త



## రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో జగిత్యాల "ఖేలో ఇండియా" కు రెండు పతకాలు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



ఈ నెల 13, 14వ తేదిల్లో హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్15 బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జగిత్యాల ఖేలో ఇండియ క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. హైదరాబాద్ ఉప్పుగూడ రైల్వే స్టేషన్ లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అండర్ 15 బాలురు, బాలికల బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జగిత్యాల క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఇందులో జగిత్యాల బాక్సర్లు ఐదు పతకాలు దక్కించుకున్నారు. ఖేలో ఇండియా తరుపున పాల్గొన్న వారిలో బాలురు అండర్ 14లో 3335 కేజీల విభాగంలో చింత గుణతేజ్ కాంస్య పతకం కైలాసం చేసుకోగా, బాలికల అండర్ 15 లో, 4043 కేజీల విభాగంలో కట్ట వాసవి రజత పతాకం గెలుచుకున్నారని ఖేల్ ఇండియా కోచ్ నల్ల నవీన్ తెలిపారు. వీరితో పాటు నేహా నాగేశ్వరి రజతం, ఆర్యన్ కార్తికేయ దీక్షి త్ రావు లకు కాంస్య పతకాలు లభించాయని ఈ సందర్భంగా విజేతలకు పథకాలతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జగిత్యాల డివైఎస్ఓ కోరుకంటి రవికుమార్, కోచ్ నవీన్ లు విజేతలను అభినందించారు.

## గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

## ఘనంగా అమావాస్య గాయత్రి హోమం



జగిత్యాల టౌన్ ప్రభాత వార్త..

శ్రీ విశ్వ గాయత్రి పరివార్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక గాయత్రి జ్ఞాన మందిర్ లో సోమవారం జేష్ఠ మాస సోమావతి అమావాస్య పర్వదినం శుభసందర్భంగా లోక కళ్యాణార్థం గురూజీ కాసం అశోక్ గుప్త, కొమురవెల్లి లక్షీ ్మనారాయణ పర్య వేక్షణలో శ్రీ గాయత్రి మహా హోమం ఘనంగా నిర్వహించారు. హోమం లో పాల్గొన్న దంపతులకు వేద పండితుల ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్న దానం గావించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత దంపతులు గుండేటి రాజు, బేబి రాణి, కనపర్తి నాగభూషణం, కటుకం అమర్నాథ్, వనమాసత్యనారాయణ, సంపత్ , కొమురవేల్లి లక్షీ ్మ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలను కాపాడిన సర్పంచ్ రాజగోపాల్ రావు..

**ఎంఈఓ సహకారంతో కొత్తపేట బడి పునఃప్రారంభం..**

*బీర్‌పూర్ ప్రభాత వార్త :*

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామ పరిధిలోని కొత్తపేట వాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సోమవారం నాడు అత్యంత ఘనంగా పునఃప్రారంభమైంది. గతంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో ఈ పాఠశాల మూతపడగా, స్థానిక పిల్లల భవిష్యత్తును



దృష్టిలో ఉంచుకుని, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు తుంగూర్ గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నూతన మండల విద్యాశాఖ అధికారి నాగభూషణం సహకారంతో మూతపడిన పాఠశాలను తిరిగి తెరిపించడంలో ఆయన విజయవంతమయ్యారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల తొలి రోజు కావడంతో ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి నాగభూషణం పాఠశాల పునఃప్రారంభ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షి ంచారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. కేవలం గ్రామ పాలకునిగా పరిమితం కాకుండా, ప్రభుత్వ పాఠశాలల రక్షణకు, తుంగూర్ గ్రామంలో విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ రాజగోపాల్ రావును కొత్తపేట మరియు తుంగూర్ గ్రామ ప్రజలు అభినందనలతో ముంచెత్తారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలు ఇతర గ్రామాల సర్పంచులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు తిరుపతి, రాజశేఖర్, పరంధాములు, గ్రామ నాయకులు ఉయ్యాల కిషన్, స్వామి, దోసారపు బుచ్చన్న, పిప్పల గంగారాజం, పాఠశాల ఉపాధ్యాయులు అక్షయ్, జనార్ధన్, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి ౖ, ఆయా మరియు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

*మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:*

మెట్‌పల్లి పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు ఆర్డీవోకు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతూ కార్పొరేట్ స్థాయి ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యాసంస్థల్లో కనీస వసతులు లేకపోయినా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అలాగే పాఠశాలల ప్రాంగణంలో లేదా సమీపంలో పుస్తకాలు, యూనిఫార్ములు, టైలు, బెల్టులు, షూస్ తదితర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలనే ప్రభుత్వ నిబంధనలను అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువమోర్చా అధికార ప్రతినిధి బోడ్ల నరేష్, జిల్లా కార్యదర్శి గోపినావేణి రమేష్, నూనె క్రాంతికుమార్ పాల్గొన్నారు.




# హుజురాబాద్‌లో పండుగలా ప్రారంభమైన పాఠశాలలు

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:*

వేసవి సెలవుల అనంతరం హుజురాబాద్ మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు సోమవారం ఘనంగా పునఃప్రారంభ మయ్యాయని మండల విద్యాధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ



సందర్భంగా పాఠశాలలను తోరణాలతో అందంగా అలంకరించి, ఒక పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు. తొలిరోజు బడికి వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు పూలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆత్మీయంగా స్వాగతం పలికారు. బడిబాట షెడ్యూల్‌లో భాగంగా మొదటి రోజే విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. బడికి హాజరైన పిల్లలందరికీ నూతన పాఠ్యపుస్తకాలను, నోట్ బుక్‌లను అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ద్వారాలు తెరిసినప్పటికి సోమవారం అమావాస్య తిథి కావడంతో పిల్లలను పాఠశాలకు పంపడానికి తల్లిదండ్రులు సుముఖంగా లేకపోవడంతో హాజరు శాతం తగ్గింది. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 10 శాతం మేర నూతన అడ్మిషన్లు (నమోదు) పెంచాలని తల్లిదండ్రులకు వివరించినట్లు ఎంఈఓ తెలిపారు.

## హుజురాబాద్‌లో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ

**-- డ్రైనేజీ పూడికతీత పనులు పరిశీలన**

*హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:*

హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, మున్సిపల్ కమిషనర్ కిషన్ లు సంయుక్తంగా పట్టణంలో పర్యటించి పలు అభివృద్ధి, పరిశుభ్రత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా అవంతి బార్ పక్కన ఉన్న ప్రధాన మురుగు కాలువ (పెద్ద మోరి) బ్లాకేజీలను తొలగించేందుకు జేసీబీ సహాయంతో చేపడుతున్న పూడికతీత



పనులను వారు దగ్గరుండి పర్యవేక్షించారు. వర్షాకా లం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మురుగు నీరు సజావుగా సాగిపోయేలా చూడాలని అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్ తో పాటు మున్సిపల్ సిబ్బంది, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఉపవాస దీక్షలు విజయవంతం చేయాలి

*మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :*

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న హైదరాబాద్ బస్ భవన్ వద్ద నిర్వహించనున్న ఒకరోజు ఉపవాస దీక్షను విజయవంతం చేయాలని మెట్‌పల్లి డిపో సారధ్య కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. సోమవారం మెట్‌పల్లి బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో 2017అలాగే2021 సంవత్సరాలకు సంబంధించిన బకాయిల చెల్లింపు సహా పలు సమస్యల పరిష్కారానికి విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో గట్ల రమేష్, రేండ్ల రమేష్, కేఎస్ రావు, డి. నారాయణ, పి. రాజేశ్వర్, ఎం. మల్లయ్య, కుర్రాల కిషన్, ఎంఎల్ అలీ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




**కరీంనగర్ వార్త**

# జర్నలిస్టుకు పద్మ రత్న అవార్డు ప్రధానం

*చిగురుమామిడి, ప్రభాత వార్త :*

మీడియా రంగంలో రాణిస్తూ పద్మశాలి కులస్తులకు, సమాజానికి విశేషంగా కృషి చేస్తున్న చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన జర్నలిస్టుకు కరీంనగర్ జిల్లా పద్మశాలి అఫీషియల్ ప్రొఫెషనల్,




ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, తెలంగాణ హ్యాండ్లూమ్ టెక్స్ టైల్ చైర్మన్ దూడం వెంకటరమణ, పోపా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ చేతుల మీదుగా సీనియర్ జర్నలిస్ట్ మార్త ప్రకాష్ కు పద్మ రత్న పురస్కారాలను పద్మశాలి కళ్యాణమండపం లో ఆదివారం రోజున అందజేశారు. వీరిని శాలువా తో సత్కరించి, మెమెంటో ప్రదానం చేశారు. వీరు ఒక డివిజన్ స్థాయి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా గత కొన్ని సంవత్సరాలుగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ హౌసింగ్ డెవలప్మెంట్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కూడా కొనసాగుతున్నారు. పద్మశాలి జిల్లా సంఘం ప్రచార కార్యదర్శిగా, తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర మీడియా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. జర్నలిస్ట్ పద్మ రత్న అవార్డు పొందటం పట్ల పలువురు చిగురుమామిడి మండల విలేకరులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## భూకబ్జాల నుండి కాలేజీ గ్రౌండ్‌ను కాపాడండి

**-- ఆర్డీఓకు బిజెపి వినతిపత్రం**

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:*

హుజూరాబాద్ పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల మైదానాన్ని భూకబ్జాల నుండి రక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బిజెపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రౌండ్ వద్ద ఆందోళన చేపట్టి, అనంతరం ఆర్డీఓ జల కుమారికి వినతి పత్రం సమర్పించారు. వేలాది మంది విద్యార్థులు, యువకులు ఆడుకునే ఏకైక మైదానంపై భూబకాసురుల కన్ను పడిందని, కాలేజీ సెలవులను ఆసరాగా చేసుకుని రాత్రికి రాత్రే జేసీబీలతో భూమిని చదును చేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని తూర్పాటి రాజు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే అధికారిక సర్వే చేపట్టి, హద్దులు నిర్ణయించి, చుట్టూ శాశ్వత ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ, పోలీస్ యంత్రాంగానిదేనని స్పష్టం చేస్తూ... ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, పట్టణ మాజీ అధ్యక్షులు గంగిశెట్టి రాజు, సీనియర్ నాయకులు, సెంట్రల్ ఫిలిం బోర్డు మెంబర్ సబ్బని రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పింఛన్ల వెరిఫికేషన్ లో వృద్ధులకు ఇబ్బంది పడకుండా చూడాలి.....

### మాజీ కౌన్సిలర్ శ్రీపతి నరేష్ గౌడ్...

*జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;*

పింఛన్ల వెరిఫికేషన్ లో వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని



మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శ్రీపతి నరేష్ గౌడ్ మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డిని కోరారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో పింఛన్ల వెరిఫికేషన్ లో వృద్ధులకు ఇబ్బంది అవుతుందని మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డినీ కలిసి వృద్ధులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారి ఇంటి వద్దనే పింఛన్ ఆధార్ కార్డు వెరిఫికేషన్ చేయాలని కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పింఛన్ల వెరిఫికేషన్ కోసం15 మంది వార్డ్ ఆఫీసర్లను కేటాయించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీపతి నరేష్ గౌడ్, దిడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థుల సహకారంతో...

## విద్యార్థుల నమోదును పెంచాలి...డిఈఓ.

*వీణవంక, ప్రభాత వార్త:*

గ్రామస్థుల సహకారంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాధికారి ఎన్.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా



పాఠశాలలు పునః ప్రారంభమైన సోమవారం వీణవంక మండల కేంద్రంలో నీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి ,విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు........ పునః మల్లన్న పల్లి పాఠశాల ప్రారంభం......వీణవంక మండలము లో నీ మల్లన్న పల్లి ప్రాథమిక పాఠశాలను బడిబాటలో భాగంగా జిల్లా విద్యాధికారి శ్రీకాంత్ రెడ్డి, మండల విద్యాధికారి ఎస్ శోభా రాణి, సర్పంచ్ కలకొండ సరోజన మధుకర్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. గతములో పాఠశాలలో పిల్లలు లేకపోవడంతో రెండు సంవత్సరాలు మూవీ వేయబడిందన్నారు. గ్రామస్థుల సహకారంతో ప్రైవేట్ పాఠశాలకు వెళుతున్న 19 మంది విద్యార్థుల తో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్ ఉపాధ్యాయులు, సి ఆర్ పి లు పాల్గొన్నారు.

## తిప్పారపు సంపత్ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

*హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:*

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పై కాంగ్రెస్ నాయకులు తిప్పారపు సంపత్ అనుచిత వ్యాఖ్యలు చేయడంను నిరసిస్తూ సోమవారం బిఆర్ఎస్ నాయకులు హుజురాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిప్పారపు సంపత్ తన పేరు కోసం ఎవరి పై పడితే వారిపై ఆరోపణలు చేయడం అలవాటని అన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదని, ప్రజాసేవ చేస్తున్న హరీష్ రావు పై విమర్శలు చేయడం, ఆరోపణలు చేయడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మారెపల్లి సుశీల, ముక్క రమేష్, బర్మావత్ యాదగిరి నాయక్, అక్కినపల్లి శిరీష, నాయకులు కొండ్ర నరేష్, విడపు అనురాగ్, తలకొక్కుల హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన.....

### ఎంఈఓ హేమలత...

*జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త*

;ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరుగుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడులలో చేర్పించాలని మండల విద్యాధికారి హేమలత పిలుపునిచ్చారు. జమ్మికుంట



మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు మొదటి రోజు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు వినుత్న రీతిలో పూల బొకేలు అందజేస్తూ స్వాగతం పలికారు. చిన్నారులు ఉపాధ్యాయులు పాఠశాలలో సర్వాంగ సుందరంగా మామిడి తోరణాలతో అలంకరించి నూతనంగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి హేమలత మాట్లాడుతూ కోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి అభ్యున్నతి కోసం పాటుపడడమే కాకుండా పాఠశాల ముగిసిన తర్వాత ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సైతం స్టడీ అవర్స్ ను నిర్వహించడం జరుగుతుందని ఇది చాలా అభినందనీయమైన విషయం అని కొనియాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఆక్టివిటీస్ తో కూడిన విద్యను అందించడంతో పాటు సైన్స్ ఫెయిర్ తో విద్యార్థుల యొక్క సృజనాత్మకతను పెంచే విధంగా ఆలోచింప చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దప్పెట రవీందర్, బలరాం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ.....

### డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్,విజేతలకు బెల్టులు సర్టిఫికెట్ల ప్రదానం...

*జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;*

జమ్మికుంట పట్టణంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో కటాస్, పంచ్, స్పారింగ్, అఫెన్స్, డిఫెన్స్, బ్లాక్ వంటి వివిధ విభాగాల్లో దాదాపు రెండు గంటల పాటు పోటీలు జరిగాయి. విద్యార్థులు తాము నేర్చుకున్న కరాటే విద్యను ప్రదర్శించిన తీరు వీక్షకులను అబ్బురపరిచింది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి యాదయ్య (హన్సీ ) చేతుల మీదుగా బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఎల్లో బెల్ట్ విభాగంలో చిలుముల గౌతమ్ , చిలుముల రిత్విక్, వేదశ్రీ విజేతలుగా నిలిచారు. గ్రీన్ బెల్ట్ విభాగంలో సంజీత, అన్విత.. బ్రౌన్ బెల్ట్ విభాగంలో మనస్విని, నిత్యశ్రీ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి ఉన్నత బెల్టులను కైవసం చేసుకున్నారు. ..కఠిన సాధనతోనే ఉన్నత స్థానాలు... కఠిన సాధన తోనే ఉన్నత స్థానాలు అందుకుంటారని మాస్టర్ యాదయ్య అన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ యాదయ్య మాట్లాడుతూ, పిల్లలు విద్యార్థి దశ నుంచే కరాటేలో కఠిన సాధన అలవర్చుకోవాలని సూచించారు. నిరంతరం శ్రమిస్తూ పోటీల్లో ప్రతిభ చాటితే ఎల్లో, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులతో పాటు అత్యున్నతమైన బ్లాక్ బెల్ట్, రెడ్ బెల్ట్ పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఉన్నత స్థాయిలను సాధించడానికి మరింత కఠినమైన శిక్షణ అవసరమని వివరిస్తూ, విద్యార్థులకు తన ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరాటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# హుజూరాబాద్ వార్త



## అధిక జ్యేష్ఠ మాసం చివరి రోజు..

### ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు..

*జమ్మికుంట / హుజురాబాద్, ప్రభాతవార్త:*

అధిక జ్యేష్ఠ మాసం చివరి రోజు శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయం (బొమ్మల గుడి) జమ్మికుంటలో సోమావతి అమావాస్య సందర్భంగా అన్నపూర్ణాదేవికి అన్నపూర్ణ సేవాసమితి మహిళలు, భవాని భజన మండలి





మహిళా బృందం లక్ష ్య కనకాంబర పుష్పార్చన, మహిళలచే లలితా సహస్ర పారాయణము, విష్ణు సహస్ర పారాయణము, లలిత సంపుటి పారాయణము నిర్వహించారు. సోమవారం ఆలయ పూజారులు మందలేముల వేణుగోపాల్ శర్మ ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలు దాతల సహాయ సహకారాలతో వచ్చిన భక్తులకు అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ ( దిలీప్), వార్డ్ కౌన్సిలర్లు చందారాజు, దిద్ది రాము, శ్రీపతి స్వర్ణలత నరేష్ పాల్గొన్నారు.

## వంగపల్లి కుంటలు, చెరువుల పరిరక్షణకు గ్రామ పంచాయతీ తీర్మానం..

### తహసీల్దార్‌కు వినతిపత్రం.

*కమలాపూర్: ప్రభాత వార్త.*

కమల మండలం వంగపల్లి గ్రామంలోని ఊరచెరువుతో పాటు సంగిని వాడి చెరువు, బ్రాహ్మణుల కుంట, నర్సింహుల కుంట, వార్లనీ కుంట, జంగాలి కుంటలు క్రమంగా అక్రమ ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో వాటిని పరిరక్షి ంచేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీ జనరల్ బాడీ సమావేశంలో కుంటలు, చెరువుల ఆక్రమణలను అడ్డుకునేందుకు తీర్మానం చేశారు. గ్రామ జల వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, లేకుంటే భవిష్యత్తులో తాగునీరు, వ్యవసాయానికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం గ్రామ పాలకవర్గం మండల తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. కుంటలు, చెరువుల హద్దులను వెంటనే గుర్తించి, సర్వే నిర్వహించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుని జల వనరులను యథాస్థితికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నకిరేకంటి రాజు, ఉప సర్పంచ్ చిలువేరు పద్మ, వార్డు సభ్యులు ఎల్కటి అశోక్, గూడెపు అరుణ, శనిగరం రవీందర్, ఎల్కటి అనిల్, వక్కల దయాకర్, పొడేటి శారద, జెరిపోతుల విజయ, పెరుమాండ్ల ప్రశాంత్, పొడేటి రమేష్, చిలువేరి సుకన్య, ఎల్కటి వనిత తదితరులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రులను చూసుకోకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవు

## జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సునీత

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:

వృద్ధుల సంరక్షణ కుటుంబ సభ్యుల బాధ్యత అని, తల్లిదండ్రులను చూసుకోకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవని జిల్లా కోర్టు ప్రధాన న్యాయ మూర్తి సునీత కుంచాల అన్నారు. సోమవారం పెద్దపల్లి మండలంలోని రాఘవా పూర్‌లో గల రెడ్డి వృద్ధాశ్రమంలో ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ నిరోధక దినోత్సవం సంద ర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధుల హక్కులు, సంక్షేమ చట్టాలు, వారికి అందుబాటులో ఉన్న న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల వారి సంతానం ప్రేమానురాగాలతో ఉండాలని సూచించారు. వృద్ధుల ఆలనా పాలనా చూసుకోకపోతే చట్ట ప్రకారం చర్యలుంటాయని తెలిపారు. వృద్ధుల సంరక్షణ, సంక్షేమానికి చట్టాలున్నాయని, ఏదేని సమస్యలుంటే వృద్ధులు న్యాయ సహాయం పొందే అవకాశాలను వివరించారు. వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయని సంతోషపడాలా లేక వృద్ధులను, తల్లి దండ్రులను వదిలేస్తు న్నారని బాధపడాలా అర్థం కావట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధాశ్రమాలకు వెళ్లే పరిస్థితి లేని సమాజం నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడిశెట్టి చామంతి శ్రీకాంత్, తహశీల్దార్ రాజయ్య, రూరల్ ఎసఐ శ్వేత, న్యాయవాది సత్యనారాయణ రెడ్డి, విశ్రాంత ఎలఐసి అధికారి అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# పర్యావరణ హితానికై ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

పర్యావరణ హితానికై ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు "ఏక్ పేడ్ మా కే నామ" కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని కోరారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో "ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరకొండ అపర్ణ నేతృత్వంలో బూత్ అధ్యక్షుడు సిలారపు



కళ్యాణ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి హాజరయ్యారు. వారు మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రామగుండం కార్పొరేషన్ కన్వీనర్ కోడూరు రమేష్, ప్రధాన కార్యదర్శి జక్కన బాలు, పాకాల నరసింహారెడ్డి, జక్కుల పద్మ, ఎల్లుర్తి సరిత రాజయ్య, గంగరాజు, బూడిద హర్ష, తిరుపతి, ఈశ్వరి, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, సుస్మితా, సుప్రియ, రాజేశ్వరి, మోహన్ గుప్తా, రావడి సాయి, కార్తీక్, అరవింద్, రాజకుమార్ , గగన, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి



పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి పెద్దపెల్లి జిల్లాలో అదనపు కలెక్టర్ రెవెన్యూగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరితో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన కొప్పుల వెంకట్ రెడ్డి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా విధులు నిర్వహించిన కొప్పుల వెంకట్ రెడ్డికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీలు, పదోన్నతుల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి లభించడంతో పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను కలుసుకున్న కొప్పుల వెంకట్ రెడ్డి, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# కోర్టుల చుట్టూ తిరగకుండా న్యాయశాఖ కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలి

## ఈ నెల 20న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:

కోర్టుల చుట్టూ తిరగకుండా న్యాయశాఖ కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. ఈ నెల 20వ తేదీన, శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా వివాదాలు శాంతియుతంగా, రాజీ మార్గంలో పరిష్కారమవుతాయని తెలిపారు. రాజీకి అనువైన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన, కుటుంబ మరియు వైవాహిక కేసులు, బ్యాంకు బకాయిల వసూళ్లు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు వంటి అంశాల్లో ఇరుపక్షాలు పరస్పరం చర్చించుకొని లోక్ అదాలత్ ద్వారా రాజీకి రావచ్చని పేర్కొన్నారు. చిన్నచిన్న వివాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోకుండా, న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని శాంతియుత పరిష్కారం పొందాలని సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీసు సిబ్బందికి తగిన మార్గదర్శకాలు అందించి, రాజీకి అనువైన కేసులను గుర్తించాలని ఆదేశించారు. ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, రాజీ కుదిరేలా కృషి చేయాలని సూచించారు. తమ కేసుల్లో రాజీ కావాలని కోరుకునే వ్యక్తులు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు త్వరితగతిన పరిష్కారమై బాధితులకు సత్వర న్యాయం అందుతుందని పేర్కొన్నారు. ఇరుపక్షాల సమ్మతితోనే రాజీ సాధ్యమవుతుందని, లోక్ అదాలత్‌లో కుదిరిన రాజీ చట్టపరంగా తుది తీర్పుగా పరిగణించబడుతుందని వివరించారు. ప్రతి కేసులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల సమన్వయంతో పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు, పోలీసు శాఖ, న్యాయస్థానాలు సమన్వయంతో పనిచేస్తే చిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారకముందే పరిష్కరించవచ్చని స్పష్టం చేశారు.

# పెద్దపల్లి వార్త



# చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా..



సుల్తానాబాద్, ప్రభాతవార్త:

సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో గల శ్రీ శ్రీనివాస చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. సంఘం అధ్యక్షురాలిగా గోలి పద్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గంజి శ్రీకాంత్ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా గుండ రాజేశం, కోశాధికారిగా ఎనగంటి ఆగయ్య ఎన్నిక కాగా, డైరెక్టర్లుగా పర్శ మల్లేశం, ఎనగంటి లక్ష్మీనారాయణ, బండి శాంతమ్మ, ఎలగం రాజేశం, ఎలిగేటి మార్కండేయ, బొద్దుల చక్రపాణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు గోలి పద్మ మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి చేనేత కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తానని తెలిపారు.ఎన్నికల అనంతరం నూతన పాలకవర్గ సభ్యులు కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని పలువురు చేనేత కార్మికులు, ప్రముఖులు అభినందించారు

# అంగన్‌వాడీల వైపు అడుగులు

గోదావరిఖని,ప్రభాత వార్త:

చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య, పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో జవహర్‌నగర్ సెక్టార్ పరిధిలోని 42, 43 డివిజన్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం "అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి అలేఖ్య పటేల్ సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మూడు నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన బోధన, పౌష్టికాహారం, మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.ప్రీస్కూల్ విద్య కోసం ప్రత్యేక కిట్లు, యూనిఫాంలు, పరదాలు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పిల్లల సమగ్ర వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడుతున్నాయని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఆర్. శ్రీమల, ఎం. రమాదేవి, బి. రాధ, కె. భాగ్యలక్ష్మి, టి. సునీతాదేవి, ఆయాలు పి. పద్మ, జి. రజిత, ఎం. రమాదేవితో పాటు పెద్ద సంఖ్యలో చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక చర్మ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి

పెద్దపల్లి, ప్రభాతవార్త:



జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక చర్మ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె శ్రీధర్ కోరారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక చొరవతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి చర్మవ్యాధుల చికిత్సకు సంబంధించిన నూతన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ పరికరాల సహాయంతో చర్మంపై ఏర్పడే పులిపిరులు, స్కిన్ ట్యాగ్‌లను తొలగించవచ్చునని, ఇతర చిన్న చర్మ సంబంధిత సమస్యలకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చునని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె శ్రీధర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ నూతన వైద్య సేవలను జిల్లా ఆసుపత్రిలో ఉచితంగా వినియోగించుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# చొప్పదండి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతాం

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర,ప్రభాత వార్త :

చొప్పదండి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు సోమవారం గంగాధర మండలం వెంకటాయపల్లి ఎల్కే గార్డెన్లో నిర్వహించిన బూత్ లెవెల్ కార్యకర్తల సమావేశనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగ మార్చాడ ని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరేస్తే ఊరే అని రైతులు సాగు చేయెుద్దని చెప్పాడని నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నవడ్ల కు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇందిరమ్మ ఇల్లు, ఒక్క రేషన్ కార్డు, ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చొప్పదండి నియోజకవర్గం లో 3500 ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినట్లు మరో 2500 కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేసినట్లు తెలిపారు.




ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చొప్పదండి మండలానికి ఇంటిగ్రేటెడ్ కళాశాల, రామడుగు మండలానికి అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్, గంగాధర మండలానికి డిగ్రీ కళాశాల, బోయిన్పల్లి మండలానికి మినీ స్టేడియం, కొడిమ్యాల మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్, కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంనికి 35 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ భూ సేకరణ కోసం 23.5 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. గంగాధర మండలం నారాయణపూర్ గ్రామ రైతుల పై తాను కేసులు పెట్టించినట్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు అభంతపు ప్రచారం చేస్తున్నారని అక్కడ కేసులు పెట్టింది బి ఆర్ఎస్ మహిళ నాయకురాలు అని కేసులు నమోదయింది బి ఆర్ఎస్ పార్టీ నాయకులు పైన అని పేర్కొన్నారు. గంగాధర చొప్పదండిలో ధర్నాలు చేసినప్పుడు కేసులు నమోదు కాలేదని గుర్తు చేశారు నారాయణపూర్ కుడికాలువ నిర్మాణం అయితే మేడిపల్లి సత్యం ఎక్కడ పేరుస్తుందోనని బి ఆర్ఎస్ పార్టీ నాయకుల కుట్ర పన్నుతున్నారని వారు ఎన్ని కుట్ర లు పండిన కుడికాలువ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న రోజుల్లో చొప్పదండి నియోజకవర్గంని మరింత అభివృద్ధి పథంలో నిలుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బూత్ లెవెల్ సమావేశం పరిశీలకుడు నామిండ్ల శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ సత్తు మల్లేశం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు గోగూరి మహిపాల్ రెడ్డి, 6 మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, జువాజి హరీష్, మంత్రి మహేందర్, కుమ్మనబోయిన సువిన్ యాదవ్, గోగూరి నాగభూషణ్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుబ్బసి బుచ్చన్న, భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్య ప్రసన్నారెడ్డి, చొప్పదండి మున్సిపల్ చైర్మన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, సింగల్ విండో చైర్మన్లు, వెలిచాల తిరుమలరావు, రాజా నర్సింహారావు, మార్కెట్ కమిటీ ఛైర్మెన్లు పొత్తూరి మహేష్, బోయిని ఎల్లేష్ యాదవ్, బొమ్మరవెని తిరుమల, జాగిరపు రజిత, సర్పంచులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# చొప్పదండి వార్త



## చిన్నారులను అంగన్ వాడి కేంద్రాలలో చేర్పించాలి

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మండలం ముత్యంపేట, బలవంతపూర్ కాశి నగర్ లో సోమవారం అమ్మ మాట అంగన్వాడి బడిబాట కార్యక్రమం సందర్భంగా 36 వయసు లోపు చిన్నారులను అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు, అంతేకాకుండా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు, కార్యక్రమంలో ముత్యంపేట సర్పంచ్ ఆదిరెడ్డి, మల్యాల ఐసిడిఎస్ సూపర్వైజర్ షమీం సుల్తానా, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు,

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

### పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి,ప్రభాతవార్త:



రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చొప్పదండి నియోజకవర్గం లో పలు పార్టీల నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం చొప్పదండి నియోజకవర్గం కమిటీల సమావేశంలో కొడిమ్యాల మండలానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ యువజన విభాగం ఉపాధ్యక్షుడు ఎండి సల్మాన్ ఆధ్వర్యంలో 30 మంది టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆహ్వానించారు. సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల అభ్యున్నతి పట్ల చిత్తశుద్ధితో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గం లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా సమస్యలు తన సమస్యలుగా తీసుకుంటూ పరిష్కరిస్తున్న తీరును తాము గుర్తించి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వెంట ఉంటే మాకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని తెలిపారు. రాజా నర్సింగరావు తోపాటు పలువురు పాల్గొన్నారు.

## డాగ్ స్క్వాడ్ బృందంతో విస్తృత తనిఖీలు

### ఎస్ ఐ.వంశీ కృష్ణ

గంగాధర,ప్రభాత వార్త :



గంగాధర మండలం మధురానగర్ లో సోమవారం ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందం,తో గ్రామంలోని పాన్ షాపులు, వైన్స్ పర్మిట్ రూమ్‌లు, పాఠశాలల్లో ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో అక్రమంగా మాదక ద్రవ్యాలు, గంజా వంటి నిషేధిత పదార్థాలు నిల్వ ఉంచుతున్నారా లేదా విక్రయిస్తున్నారా అనే అంశాలపై క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టడం జరిగింది. డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి ప్రదేశాన్ని జాగ్రత్తగా పరిశీలించి అనుమానాస్పద వస్తువుల కోసం తనిఖీలు నిర్వహించడం జరిగింది. ప్రజల్లో మాదక ద్రవ్యాల వినియోగం అక్రమ రవాణాపై అవగాహన కల్పించడంతో పాటు, నేర నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని గంగాధర ఎస్ ఐ వంశీ కృష్ణ తెలిపారు. గ్రామ ప్రజలు తమ పరిసరాల్లో ఎలాంటి అనుమానాస్పద కార్యకలపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. భవిష్యత్తులో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఈ తనిఖీలో డాగ్ స్క్వాడ్ బృందం, క్లూస్ టీమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న జగిత్యాల అదనపు ఎస్పీ

మల్యాల /ప్రభాత వార్త



జగిత్యాల జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్ చేతన్ నితిన్ సోమవారం కుటుంబ సమేతంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీస్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రధాన అర్చకులు రామకృష్ణ వారికి వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ అశోక్ ఏఎస్సై చిలుక శ్రీనివాస్ పాల్గొన్నారు,

## ప్రభుత్వ పాఠశాలలో చేరితే ఉచితంగా ఆటో సమకూరుస్తాం

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి మండల పరిధిలోని రాగంపేట జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు, సర్పంచ్ మామిడి రాజేశం, వార్డు సభ్యులు డి కొండా రమేష్, దీకొండ ప్రభాకర్, కుక్కల తిరుపతి లు కలిసి సోమవారం రాగంపేట గ్రామంలో ని సమ్మక్కపల్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని మంచి విద్య అందుతుందని తెలిపారు. మంచి విద్యతో పాటు ఒక్కొక్కరికి 60 వేల రూపాయలు ఆదా చేసుకుంటారని చెప్పారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నందున ప్రభుత్వము నుండి డబ్బులు వస్తాయని తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు దీకొండ ప్రభాకర్ విద్యార్థులను పాఠశాలకు తీసుకురావడానికి ఆటోను సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు దినకర్, ఉపాధ్యాయులు కర్ర వెంకటరాంరెడ్డి, సావిత్రి దేవి, రాణి, గంగేశం, శ్రీనివాస్, నరసయ్య, రాజ్ యుద్దీన్, యుగేందర్, రాజ్ కుమార్, శంకరయ్య, ప్రమీల దేవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నారై తోట సత్యం అర్థిక సహాయం

**రామడుగు, ప్రభాతవార్త** :ఆర్థికం గా చితికిపోయి అనారోగ్యం తో బాధపడుతున్న కుటుంబాలకు అభయహస్తం అందించిన ఎన్నారై.. వివారల్లోకి వెలితే రామడుగు మండల కేంద్రానికి చెందిన ధామరి మల్లవ్వ, కూన అంజవ్వ, ఉత్తమ్ నాంపల్లి, లోకొంజు రాములు, వేముల గంగమ్మ, వేముల భాగ్య ,మామిడి పద్మ, మహమ్మద్ సనా, ఈగ నర్సయ్య కొన్ని రోజులుగా అనారోగ్యం తో బాధపడుతున్నారు. ఇదే గ్రామా నికి చెందిన తోట సత్యం అమెరికా స్థిరపడగా వారికిసముద్రాల శ్రీనివాస్ ద్వారా విషయం తెలుసుకున్న సత్యం వెంటనే వారికి యాభై వేయిల రూపాయలు అర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సముద్రాల శ్రీనివాస్, చందా అనిల్, కర్నె శ్రీనివాస్, రామడుగు అశోక్ లు పాల్గొన్నారు. మా మాట మన్నించి ఆదుకున్నందుకు తోట సత్యం కు బాధితులు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.



## బొల్లారంలో అడ్మిషన్ల జాతర

వేములవాడ రూరల్ ప్రభాత వార్త..



వేములవాడ మండలంలోని బొల్లారం మండల ప్రజాపరిషత్ పాఠశాలలో 202627 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం తదితర సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి బొల్లారం గ్రామ సర్పంచ్ ..సౌజన్య-మల్లికార్జున్.. మద్దతు ప్రకటిస్తూ, గ్రామంలోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు.

## వానమ్మా.. రైతన్నను ఆదుకోవమ్మా.

వేములవాడ రూరల్ ప్రభాత వార్త..



ఆకాశం వైపు ఆశగా చూస్తూ రైతన్నలు వాన కోసం ఎదురు చూస్తున్నారు. జూన్ నెల సగం గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సాగుకు సిద్ధం చేసిన పొలాలు ఎండిపోతుండగా, రైతుల ముఖాల్లో ఆందోళన నెలకొంది. విత్తనాలు సిద్ధం చేసుకుని, భూములను దున్ని వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు మేఘాలు కనిపించిన ప్రతిసారీ ఆశలు చిగురిస్తున్నాయి. కానీ చినుకులు కురవకపోవడంతో ఆ ఆశలు మళ్లీ నిరాశగా మారుతున్నాయి."వానమ్మ ఒక్కసారి రావమ్మా.. మా పొలాలకు ప్రాణం పోయమ్మా" అంటూ రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ములవాగు పరివాహక ప్రాంతాల్లో ఈ సమయానికి సాగు పనులు ఊపందుకునేవని, ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో పొలాలు బీడుగా మారాయని రైతులు చెబుతున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోతే పంటల సాగు ఆలస్యం కావడంతో పాటు విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగి మరింత ఆర్థిక భారం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండిపోయిన నేలలు, అడుగంటుతున్న చెరువులు, సాగునీటి కొరత రైతన్న కష్టాలను రెట్టింపు చేస్తున్నాయి. ఒక్క మంచి వాన పడితేనే నేలతల్లి పచ్చదనం సంతరించుకుంటుందని, రైతన్న ముఖంలో చిరునవ్వు విరుస్తుందని గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, అన్నదాత కష్టాలకు ఫలితం దక్కాలని రైతన్నలు వేడుకుంటున్నారు.

## ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

ప్రభుత్వ కాలేజీల్లో నాణ్యమైన విద్య అందుతుందని ప్రిన్సిపాల్ దేవరాజు స్పష్టం చేశారు. సోమవారం కళాశాల పునః ఆరంభమైన సందర్బంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరవములో ఇంటర్ వార్షిక పరీక్షలలో అన్ని సబ్జెక్టులలో100 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే ప్రభుత్వ కళాశాలలో ప్రథమ స్థానంలో ఇల్లంతకుంట మండల జూనియర్ కళాశాల నిలిచిందన్నారు. మండలములో పదవ తరగతి లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎక్కడికో



వెళ్లకుండా మన ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొంది నాణ్యమైన విద్యను అభ్యసించాలని కోరారు. స్కాలర్షిప్ సౌకర్యం, ఉచిత పాఠ్య పుస్తకాలు మొదలగు ఇతర సదుపాయాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ అన్నారు.

## శ్రీ దుర్గామాత ఆలయ కార్యవర్గం ఎన్నిక



చందుర్తి / ప్రభాతవార్త

చందుర్తి మండల కేంద్రంలోని శ్రీ దుర్గామాత ఆలయ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ దారం నర్సయ్య, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పత్తిపాక వెంకటేశం ఉపాధ్యక్షుడిగా లింగాల తిరుపతి, క్యాషియర్గా మోతె బాబు, ప్రధాన కార్యదర్శిగా దారం రామచంద్రం లను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా మర్రి మహేష్, పొంచెట్టి తిరుపతి, బత్తుల శశి, సుంకి శ్రీనివాస్, పులి నరేష్, లింగంపల్లి రాములు, మోతే బాబు, మ్నెగని రవి, తోట శ్రీనివాస్, ఉలేస్ అంజయ్య తదితరులను ఎన్నుకున్నారు.

## మత్తుపదార్థాల రహిత గ్రామం నాగారం పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



మద్యం, గుట్కా, అంబార్, గంజాయి లాంటి మత్తు పదార్థాలను విక్రయించడం నిషేధం విధించినట్లు సర్పంచ్ అప్పాల నాగభూషణం తెలిపారు. సోమవారం మండలంలోని నాగారం గ్రామ పంచాయతీ పాలక వర్గం గ్రామసభ ఏర్పాటు చేసి, మత్తు పదార్థాల విక్రయాల నిషేధాన్ని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ మంగళవారం నుంచి గ్రామంలో మద్యం, అంబార్ గుట్కా గంజాయి లాంటి మత్తు పదార్థాలు విక్రయించిన వారికి రూ. 30 వేల జరిమానా విధించడం జరుగుతుందని, పట్టించిన వారికి రూ.10 వేలు నజరనా ఇస్తామన్నారు. అదేవిధంగా ప్రజారోగ్యం, రోడ్డు భద్రత, గ్రామ శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామ పంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గ్రామ పరిధిలో వాహనాలు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో మాత్రమే నడపాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారే వాహనాలు నడపాలన్నారు. ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలు గ్రామంలో ప్రయాణించే సమయంలో సౌండ్ సిస్టమ్‌లను నిలిపివేయాలని, గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, దేవాలయాలు, వద్ద బీటీలు, ప్రభుత్వ స్థలాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మత్తు పదార్థాల వినియోగం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం పూర్తిగా నిషేధించబడిందన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామ పంచాయతీ నిర్ణయాల ప్రకారం కఠిన చర్యలు అమలు చేస్తామన్నారు. ఇక్కడ వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు అందజేత



కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను అందజేసినట్లు సర్పంచ్ అప్పాల నాగభూషణం తెలిపారు. సోమవారం మండలంలోని నాగారం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం పంపిణీ చేసే పుస్తకాలను విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ముస్తాబాద్ ప్రభాత వార్త:

డిడి ఒక ట్రాక్టర్ కు కట్టి మరో ట్రాక్టర్ లో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై పోలిసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఇలా డిడి ల పేరిట అక్రమ ఇసుక దందా ఎల్లప్పుడూ కొనసాగుతుం ది. జిల్లాలు దాటుతున్న అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని స్థానికులు వాపోతున్నారు.






## మల్లికార్జున స్వామిని దర్శించుకున్న మాజీ జెడ్పిటిసి

చందుర్తి / ప్రభాతవార్త

చందుర్తి మాజీ జెడ్పిటిసి నాగం కుమార్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారిని, వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి, హైదరాబాద్ బల్కంపేట ఎల్లమ్మ తల్లిని సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు, కొమురవెల్లి ఆలయ అర్చకులు మాజీ జెడ్పిటిసి కి సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి సన్మానించారు, జన్మదినం సందర్భంగా వివిధ గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు వేడుకలను నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బోర్ర రవీందర్, ఎక్కలదేవి అనిల్ కుమార్, బైరగోని హరీష్ తదితరులు ఉన్నారు

## ఎస్సీ కమ్యూనిటీ భవనముకు బోరు ఏర్పాటు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



కోనరావుపేట మండలం కేంద్రంలోని ధర్మారం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం కు బోరు వేయించినట్లు సర్పంచ్ మిర్యాల్ కార్ బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ నిధుల తో బోర్ వేయడం జరిగిందన్నారు. నిధులు మంజూరు చేసిన బండి సంజయ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఉప సర్పంచ్ శ్రీనివాస్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేష్ గౌడ్, గ్రామ శాఖ బూత్ అధ్యక్షులు కొమ్ము తిరుపతి, మల్లబోయిని విజయ్, వార్డు సభ్యులు ఎదురుగట్ల నాగేష్, ఎస్సీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, కార్యకర్తలు ఉన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలి

చందుర్తి / ప్రభాతవార్త



విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ముందుకు సాగాలని నర్సింగాపూర్ సర్పంచ్ మరాఠీ మల్లిక్ అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని సూచించారు. లక్ష్యాలను నిర్దేశించుకొని చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింగాపూర్ ఉప సర్పంచ్ జీవన్ రెడ్డి, ఏ ఏ పి సి ఛైర్మెన్ లావణ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాల్గొన్నారు.

## వేములవాడ గోశాలకు ట్రాక్టర్ గడ్డి వితరణ

ముత్తారం, ప్రభాతవార్త:

ముత్తారం మండలం హరిపురంకు చెందిన ఏగుర్ల రాజు ట్రాక్టర్ గడ్డిని అందజేశారు. వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంకు సంబంధించిన గోశాలలోని కోడెల కోసం ఈ గడ్డిని అందించారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఈ సందర్భంగా ఆయన వేడుకున్నారు. ప్రతి రైతుకు సమృద్ధిగా పంటలు పండి సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

## పామాయిల్ సాగుకు రైతులు ముందుకు రావాలి

మంథని రూరల్ ప్రభాతవార్త:



మంథని మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతు నెత్తుట్ల మల్లయ్య తోటలో 4.20 ఎకరాల్లో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ పామాయిల్ మొక్కలు నాటారు. అనంతరం డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి, కూరగాయల తోటలను సందర్శించి రైతులతో మాట్లాడారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం వివిధ రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. పామాయిల్ పంట దీర్ఘకాలిక ఆదాయం అందించే లాభదాయక పంట అని, రైతులు ఈ సాగు వైపు ఆసక్తి చూపాలని కోరారు. ఉద్యాన శాఖ ద్వారా బిందు సేద్య పరికరాలు, పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాలు, కూరగాయల సాగుకు సబ్సిడీలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారి ఎ. జ్యోతి, ఉద్యాన విస్తరణ అధికారి రాజశేఖర్, పామాయిల్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్య రంగాల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి

మంథని రూరల్ ప్రభాతవార్త:



విద్యా, వైద్య రంగాల్లో జరుగుతున్న విచ్చలవిడి ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. ప్రసాద్ డిమాండ్ చేశారు.సోమవారం మంథనిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పెద్దపల్లి జిల్లా మూడవ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ వాటిపై నియంత్రణ లేకపోవడం బాధాకరమన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, ప్రభుత్వ వైద్య సేవలను బలోపేతం చేయాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించేందుకు విశాల ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చిన ఆయన, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా మంద రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా బూడిద గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దుర్గయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అర్ల సందీప్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వేల్పుల సురేష్, బి. రవి తదితరులు పాల్గొన్నారు.

## బడుల ప్రారంభానికి అమావాస్య ఎఫెక్ట్

మంథని ప్రభాతవార్త:



నూతన విద్యా సంవత్సరం 202627కు అమావాస్య ఎఫెక్ట్ తాకింది. సోమవారం అమావాస్య కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు పంపించడానికి సందిగ్ధానికి గురయ్యారు. అమావాస్య మూఢనమ్మకంతో విద్యార్థులను ప్రారంభం రోజున పాఠశాలలకు దూరం చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు విద్యాలయాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఏఐ టెక్నాలజీ రోజుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు అమావాస్య రోజున పాఠశాలకు పంపివద్దు అనే కారణంగా మొదటిరోజు విద్యార్థులు లేని పాఠశాలలుగా చాలా పాఠశాలలు తెర్చుకున్నాయి. నేడు మంగళవారం కావడంతో పాఠశాలకు పంపించేందుకు విముఖంగా ఉన్నారు. బుధవారం లేదా శుక్రవారం విద్యార్థులు తల్లిదండ్రులను పాఠశాలలకు పంపించేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం.

## మా పాఠశాలలో చేర్పించండి: ఉపాధ్యాయులు ప్రచారం

రామగిరి ప్రభాతవార్త



మా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండని బేగంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. సోమవారం రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు ఆధ్వర్యంలో 9వ, 10వ తరగతి విద్యార్థులను బేగంపేట పాఠశాలలో చేర్పించడానికి సమావేశం నిర్వహించారు. తమ పాఠశాలలో 10వ తరగతి విద్యను అభ్యసించే వారికి గతంలో మాదిరిగా విమానంలో వైజాగ్ కి విహారయాత్రకు తీసుకువెళ్తామని గణిత ఉపాధ్యాయులు మల్కా రాంకిషన్ రావు హామీ ఇచ్చారు. ఇక విద్యార్థులందరికీ ఉచితంగా రాను, పోను ఆటో సౌకర్యం కలిపిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు రీడింగ్ కార్నర్ మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శైలజ, ఉపాధ్యాయులు మల్కా రాంకిషన్ రావు, పద్మజ, శ్రీనివాస్,సంపత్ కుమార్, గీతారాణి, మంగ, శ్రీదేవి, స్వరూప, పికెటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య శాఖ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవు

మంథని ప్రభాతవార్త:



మంథని పట్టణ శివారులోనే అయ్యగారి చెరువు పక్కన ఉన్న మత్స్య శాఖకు సంబంధించిన భూమిని కబ్జాదారులు కబ్జా చేస్తే వారి పైన చర్యలు తీసుకుంటామని మంథని మత్స్య శాఖ అధ్యక్షులు జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ పోతరవేని క్రాంతికుమార్ తెలిపారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మంథని మున్సిపల్ పరిధిలోని అయ్యగారి చెరువు పక్కన ఉన్న ఫిషరీస్ శాఖకు చెందిన భూమిని సోమవారం సంబంధిత అధికారులు సర్వే చేశారు. సర్వే నెంబర్ 20లో గల ఒక ఎకరం 38 గుంటల భూమిని మత్స్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కొలతలు పూర్తి చేశారు.. ఈ సందర్భంగా మంథని మత్స్యశాఖ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వానికి చెందిన ఈ మత్స్యశాఖ భూమిని కొంతమంది కబ్జా కోరులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించామని ఆలోచనను మానుకోవాలని హెచ్చరించారు. ఇకపై ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే ఈ భూమి సర్వే ప్రక్రియ వేగవంతం కావడానికి సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు మంథని ఆర్డీవో, తహసీల్దార్ లకు మంథని మత్స్యశాఖ తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

## స్వచ్ఛమైన తాగునీటి నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి ప్రభాతవార్త

ఆర్వో వాటర్ ప్లాంట్ ద్వారా అందిస్తున్న స్వచ్ఛమైన త్రాగునీటిని ప్రజలు



సద్వినియోగం చేసుకోవాలని ముస్యాల సర్పంచ్ సుంకరి మహేందర్ అన్నారు. సోమవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద గల వాటర్ ప్లాంట్ ను సర్పంచ్ మహేందర్ పున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా గ్రామంలో వాటర్ ప్లాంట్ పనిచేయక త్రాగునీటికి ప్రజలు బందులు పడుతుండడంతో ఆర్వో వాటర్ ప్లాంటును మరమ్మత్తులు చేయించి పున ప్రారంభించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాసినేని వినోద సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, ఆసియా నిషాత్, వార్డు సభ్యులు,నీలం శ్రీనివాస్, గోశిక విజయ్, గుమ్మడి మల్లయ్య, సుందిళ్ల శారద, సుందిళ్ల కనకతార, గోశిక నరసయ్య, దేగ సందీప్ కుమార్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మంథని వార్త



## స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షునిగా అశోక్ చారి

ముత్తారం, ప్రభాతవార్త:



స్వర్ణకారుల సంఘం ముత్తారం మండల నూతన అధ్యక్షునిగా అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ఆకోజు అశోక్ చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్వర్ణకారుల సంఘం మండల నూతన కమిటీకి ఎన్నికలు జరిగాయి. ముఖ్య అతిథిగా కమాన్‌పూర్ మండల మార్కెట్ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా ఆకోజు అశోక్ చారి, ప్రధాన కార్యదర్శిగా రామగిరి సత్యనారాయణ, కోశాధికారిగా ఆకోజు జగదీశ్వర్ చారిలను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన అధ్యక్షుడు ఆకోజు అశోక్ చారి మాట్లాడుతూ ముత్తారం మండల స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి తన సాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## పారుపల్లిలో రోడ్డు పనులు ప్రారంభం



ముత్తారం, ప్రభాతవార్త:

ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గత 30 సంవత్సరాల కింద ఉన్న రోడ్డు పనులను సోమవారం పునర్ ప్రారంభించి, పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ చొప్పరి సంపత్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా, గ్రామస్తులకు ఉపాధి కల్పిస్తూ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం గ్రామస్తులకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడ బాపయ్య, పీక శంకర్, ఇనుముల ప్రదీప్, నారెడ్ల దేవేందర్, నీలం అనిల్, ఇరుకురాల ఓదెలు, ఫీల్డ్ అసిస్టెంట్ రాకేష్ తదితరులున్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

ముత్తారం, ప్రభాతవార్త:



తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మచ్చుపేట సర్పంచ్ చిలివేరి జ్యోతి లక్ష్మణ్ పిలుపు నిచ్చారు. సర్పంచ్ చిలివేరి జ్యోతి లక్ష్మణ్ దంపతులు తమ కుమారుడిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ప్రైవేట్ విద్యాసంస్థల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్న ప్రస్తుత రోజుల్లో, ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని పెంచేలా వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకంతో పాటు నాణ్యమైన విద్య, వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామ ప్రజలందరూ కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సర్పంచ్ ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి గ్రామస్తులంతా కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ దంపతుల ఈ నిర్ణయాన్ని ముత్తారం మండల విద్యాధికారి హరిప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాప్రతినిధులు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత భరోసా, నమ్మకం పెరుగుతుందని ఆయన కొనియాడారు.

# పౌష్టికాహారం అంగన్వాడి కేంద్రాలకు పంపించాలి

### సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్

**గొల్లపల్లి, ప్రభాతవార్త :**

చిన్నారుల భవిష్యత్తుకు పునాది ప్రీ స్కూల్ విద్యేనని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని రాగవపట్నం సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్ అన్నారు. గ్రామంలో నిర్వహించిన "అమ్మమాట అంగన్‌వాడీ బాట" కార్యక్రమంలో భాగంగా ప్రీ స్కూల్ విద్యపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆటల ద్వారా అక్షరాలు, సంఖ్యలు, రంగులు మరియు ఆకారాలు వంటి ప్రాథమిక విషయాలను నేర్పించడం జరుగుతుందని తెలిపారు. ఇది వారి భవిష్యత్తులో విజయానికి ఎంతో దోహదపడుతుందని, "చదువు మన హక్కు మన భవిష్యత్తు" అనే నినాదంతో ప్రతి పిల్లాడిని అంగన్‌వాడీకి పంపించాలని పిలుపునిచ్చారు. ఖిప్రతి పిల్లాడు అంగన్‌వాడీకే... ప్రతి అడుగు బడికేళ్లి వైపు పడాలని ఆకాంక్షించారు. ఈ "అంగన్‌వాడీ బడి బాట" కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్ ,కార్యదర్శి బి. నరేష్ , వార్డు నెంబర్లు శ్రీను, తిరుపతి మరియు బుర్ర తిరుపతి,కాసారపు ప్రవీణ్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు . రమాదేవి,స్వప్న,జలజ, ఆయా శోభ, ఏ ఎన్ ఎం బుచ్చమ్మ, ఆశా. కార్యకర్త రాధ తదితరులు సంఖ్యలో పాల్గొన్నారు



## బూత్ లెవెల్ పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

**ధర్మపురి,ప్రభాతవార్త**

.ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణ రాష్ట్రంలోని ఓటర్ జాబితా నుండి ఓట్లను తొలగించేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని, ఇట్టి విషయంలో బూత్ స్థాయి పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో సోమవారం బూత్ లెవెల్ పోలింగ్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి వివిధ రాష్ట్రాల్లో అధికారం చేపట్టేందుకు ఓటు చోరీకి పాల్పడుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కుట్రను అడ్డుకోవడానికి రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో బూత్ స్థాయిలో పోలింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇస్తూ, ఓట్లను కాపాడాలని పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు.అందులో భాగంగా ఇట్టి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో 269 పోలింగ్ బూత్ ల్లో 3.37 లక్షల ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. రానున్న జడ్పిటిసి ఎన్నికలతో పాటు 2029 లో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజయం సాధించడంలో బూత్ లెవెల్ పోలింగ్ ఏజెంట్ల పాత్ర కీలకమని వివరించారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని, మాజీ మంత్రులు జీవన్ రెడ్డి,కొప్పుల ఈశ్వర్ లు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ,కాంగ్రెస్ పార్టీని ఇబ్బందుల గురి చేయడానికి ప్రయత్నిస్తున్నారని, వారి ఆరోపణలను ప్రజలు నమ్మరని అన్నారు. జీవన్ రెడ్డి లాగా నాయకులను విభజించడం తనకు తెలియదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రుద్ర సంతోష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నందయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య,నియోజవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు






## శతాధిక వృద్ధురాలు మృతి

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



మండలములోని అనంతారం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు వెల్మ రామవ్వ(107)సోమవారం మృతి చెందింది. వివరాల ప్రకారం మృతురాలు రామవ్వ మరణించే వరకు తన పనులు తానే చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. వయసు మీద పడ్డా కూడా ఇంటికి వచ్చిన వాళ్ళను ఆప్యాయంగా పలకరించేదని పేర్కొన్నారు. మృతురాలుకు నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు, మనుమాళ్ళు, మనుమలు ఉన్నారు.సోమవారం జరిగిన రామవ్వ అంత్య క్రియల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

**. ధర్మపురి,ప్రభాతవార్త.**



ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన మురిమడుగు శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా,ధర్మపురి మండల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు రూ.16500 ఆర్థిక సాయం అందించారు. ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యుడు ఆపదలో ఉన్నప్పుడు తమ బాధ్యతగా కొంత ఆర్థిక సహాయం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు అయ్యోరి సత్యం, యూనియన్ నాయకులు రాజేంద్రప్రసాద్, మీరు రమేష్, సతీష్, చంద్ర శేఖర్, సంతోష్ తదితరులున్నారు.

## ఇసుక డంపులపై విజిలెన్స్ అధికారుల దాడులు


### సుమారు 500 ట్రిప్పుల ఇసుక సీజ్.

**ధర్మపురి,ప్రభాతవార్త.**

ధర్మపురి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలోని వివిధ చోట్ల నిల్వ ఉంచిన ఇసుక డంపు లపై సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు జరిపి, సుమారు 500 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు సమాచారం. కొందరు వ్యక్తులు హైదరాబాద్ లోని విజిలెన్స్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో ఇట్టి దాడులు నిర్వహించినట్లు తెలిసింది. రెవెన్యూ,విజిలెన్స్ అధికారులు ఇసుక డంపులను పంచానామ చేసి ఉన్నత అధికారులకు నివేదించనున్నట్లు సమాచారం.

## నేటి నుండి శ్రీ కాలభైరవ సహిత అష్టభుజ దుర్గాదేవి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు

**గొల్లపల్లి, ప్రభాతవార్త**



: గొల్లపల్లి మండల కేంద్రంలో వెలసిన శ్రీ కాలభైరవ సహిత అష్టభుజ దుర్గాదేవి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు నేటి నుండి మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల రాకతో మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.మహోత్సవాలు మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమయ్యాయి. అనంతరం గ్రామదేవతల పూజలు, వథకావిష్కరణ, తీర్థానయనం, గోపూజ, యాగశాల సంస్కరణ, మండపారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం వేదపారాయణం, మండప పూజలు, దిగ్బంధన, జలాధివాసం, హవనం, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నారు. మహిళా భక్తులు కుంకుమార్చనలో పాల్గొననున్నారు.బుధవారం అష్టభైరవ, ఏకాదశ రుద్ర, వాస్తు మండప పూజలు, జలాధివాస విమోచనం, పంచకోశ విధి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవాచనం, మూర్తి, గాయత్రి, అఘోర, మృత్యుంజయ హోమాలు, అష్టబలి నిర్వహించనున్నారు. అనంతరం విగ్రహాలతో శోభాయాత్ర వైభవంగా సాగనుంది.గురువారం ఉదయం సుప్రభాత సేవ అనంతరం శ్రీ కాలభైరవ సహిత అష్టభుజ దుర్గాదేవి యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, అగ్ని ప్రజ్వలన, అష్టదిగ్బంధన పూర్ణాహుతి హోమం నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు.కాలభైరవ ఆరాధన వల్ల సకల శుభాలు కలుగుతాయని ప్రజల విశ్వాసమని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు, త్రాగునీటి సౌకర్యం, వాహన పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## ధర్మపురి బస్టాండ్ అభివృద్ధి కోసం కృషి చేస్తా

**ధర్మపురి,ప్రభాతవార్త.**



ధర్మపురి పట్టణంలోని బస్టాండ్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, అందుకోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించడం జరుగుతుందని రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి బస్టాండ్ ప్రాంగణాన్ని ఆర్టీసీ కరీంనగర్ ఈడి సోలొమాన్, ఆర్ఎం రాజు తో కలిసి సోమవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురిలో బస్సు డిపో ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో బస్సు వస్తుందని హామీ ఇచ్చారు. బస్టాండ్ లో రెండు కొత్త ప్లాట్ ఫామ్ లు నిర్మిస్తామని, బస్టాండ్ అభివృద్ధి కోసం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిధులు మంజూరు కోసం అంగీకరించారని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం బస్టాండ్ లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

### 26 ద్విచక్ర వాహనాలు, 6 కార్లు స్వాధీనం.– డీఎస్పీ ప్రసన్న కుమార్..

**సూర్యాపేట రూరల్, జూన్ 15 (ప్రభాతవార్త) :**

నేర నియంత్రణ, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించే లక్ష్యంతో సోమవారం తెల్లవారుజామున సూర్యాపేట రూరల్ పోలీస్ పరిధిలోని అంజనాపురి, మానస నగర్ కాలనీల్లో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు.ఈ తనిఖీల్లో సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్‌తో పాటు 80 మందికి పైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాలనీలోని ఇళ్లను, నివాసితులను క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలు సేకరించారు. ముఖ్యంగా రాజస్థాన్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వచ్చి నివాసం ఉంటున్న కూలీల వ్యక్తిగత వివరాలు, వారి నేపథ్యాలను పరిశీలించారు.సోదాల సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలు, 6 కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని, ప్రజలు అప్రమత్తత, అవగాహనతోనే నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చున్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, తెలియని లింకులను క్లిక్ చేయడం, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు ఇతరులకు తెలియజేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎస్పీ ప్రసన్నకుమార్ కోరారు.ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రాజశేఖర్, స్థానిక ఎస్సై బాలు నాయక్,ఇతర ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై.. టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఉక్కుపాదం..

## 150 ట్రాక్టర్ల అక్రమ ఇసుక డంప్‌లు స్వాధీనం..

## టాస్క్‌ఫోర్స్ ఎసిపి సతీష్

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:*

చాలా కాలంగా హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని జమ్మికుంట, హుజురాబాద్, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్ మండలాల నుండి అక్రమ ఇసుక పెద్ద మొత్తంలో పరిసర మండలాలకే కాకుండా హన్మకొండ, వరంగల్ లాంటి పట్టణాలకు ట్రాక్టర్‌లు, టిప్పర్లు, లారీల ద్వారా అక్రమంగా రవాణ జరుగుతుందన్న అరోపణలు వెల్లువెత్తడంతో కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ అలం, హుజురాబాద్ ఎసిపి వాసంశెట్టి మాధవిల ఆధ్వర్యంలో పలు మార్లు ఈ ప్రాంతాలలో అకస్మిక తనిఖీలు నిర్వహించినప్పటికి అక్రమ ఇసుక రవాణ అరికట్టడంలో స్థానిక పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు విఫలమయ్యారని రాష్ట్ర విజిలెన్స్ ఉన్నతాధికారులు ప్రభుత్వ యంత్రాంగానికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తుంది.

దీనితో కరీంనగర్ సిపి గౌస్ అలం అధేశాల మేరకు సోమవారం జమ్మికుంట మండలం విలాసాగర్ దాని పరిసర ప్రాంతాలలో టాస్క్‌ఫోర్స్ ఎసిపి వాసాల సతీష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఒక్కసారిగా ముప్పెట డంపులపై దాడి చేసారు. మానేరు పరివాహాక ప్రాంతాలలో మానేరు ఒడ్డున విలాసాగర్ గ్రామంలో అక్రమంగా నిల్వలు చేసిన సుమారు 150 ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎసిపి వాసాల సతీష్ విలేకరులకు



వెల్లడించారు. పట్టుబడ్డ మూడు భారీ అక్రమ ఇసుక డంపులను సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు వెల్లడించారు. ఈ దాడులపై ఇసుక అక్రమ రవాణాదారులు షాక్‌కు గురైయ్యారు.

విలాసాగర్ గ్రామం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అక్కడికక్కడే సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. విలాసాగర్‌లో సీజ్ చేసిన ఇసుక డంపులను జమ్మికుంట పోలీసులకు స్వాధీనం చేసినట్లు ఎసిపి సతీష్ వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్విన, నిల్వ ఉంచిన రవాణ చేసిన కఠిన చర్యలు ఉంటాయని కరీంనగర్ సిపి గౌస్ అలం అధేశాలు జారీ చేసారు. అక్రమ ఇసుక రవాణపై నిరంతరం నిఘా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రాంతంలో యదేశ్చగా ఇందిరమ్మ ఇండ్ల పేరు మీద, ప్రభుత్వ భవనాల నిర్మాణం, రోడ్ల నిర్మాణం పేరుతో ఇసుకాసురులు మూడు శాఖల అధికారులను ప్రసన్నం చేసుకుని ఈ అక్రమ ఇసుక రవాణాను గతంలో రాత్రి వేళల్లో తరలిస్తే.. ఇప్పుడు అధికార యంత్రాంగానికి ప్రజలకు అనుమానాలు రాకుండా ఉదయం 4గంటల నుండి 10 గంటల లోపు యదేశ్చగా ఇసుక రవాణ జరుగుతున్నదని ఈ ప్రాంత ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

**ఈ రవాణ వెనుక అదృశ్య హస్తం ఎవరిది..?**

జిల్లా పోలీస్ యంత్రాంగం సబ్ డివిజన్ పోలీస్ అధికారులు అక్రమ ఇసుక రవాణాపై ప్రతినెల క్రైం మీటింగ్‌లో సంబంధిత పోలీస్ స్టేషన్‌ల అధికారులపై కొరడ జులిపిస్తున్న కఠినమైన అధేశాలు జారీ చేస్తున్న నిమ్మకు నీరెత్తనట్లు అధికారులు వ్యవహరిస్తూ ఇసుక రవాణాలో వారి కాలికి ఇసుక రేనువులు అంటకుండా కింది స్థాయి (బ్లూకోట్) సిబ్బంది ఇసుకాసురలకు సహకరిస్తున్నట్లు వారి సహాకారం వల్లనే మానేరు వాగులు, వంకలు పోలీస్ స్టేషన్ పరిధి దాటుతూ రవాణ జరుగుతున్నదని అటు ఇసుక వ్యాపారులు, ఇటు ప్రజలు బాహటంగా చర్చించుకుంటున్నారు. కుడివైపులో ఇసుక రవాణ వాహానాలు బయలుదేరితే ఈ సిబ్బంది మండలానికి ఎడమవైపు రూట్‌లో విధులు నిర్వర్తిస్తారు. మరో నాడు ఎడమ వైపులో వాహానాలు వెళ్లిపోతుంటే.. కుడివైపు రహదారుల్లో తనిఖీలు చేస్తుంటారు. అధికారుల మెప్పు పొందేందుకు రెండు, మూడు రోజులకు ఒకసారి అడపదడప ఒకటి, రెండు ట్రాక్టర్లు పట్టుకుని దానికి వందరకాల ఫోటోలు విడుదల చేసి పబ్లిసిటీ ఇస్తున్నారు. జమ్మికుంట, వీణవంక మండలాల నుండి రాత్రి 3గంటల నుండి తెల్లవారు 5గంటల లోపు అడ్డదారుల్లో ఎన్ని ట్రాక్టర్లు వెళ్తున్నాయో.. ఆయా గ్రామాల ప్రజలు గణాంకాలతో పాటు లెక్కించి చెబుతున్నారు. నాగంపేట వద్ద కొద్ది రోజుల క్రితం చెక్‌పోస్టు వద్ద నిజంగానే తప్పు చేసిన ఇద్దరు పోలీస్ సిబ్బందిపై అధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేసారు..... మరి అక్రమ రవాణ ఆగిపోయిందా..? దీని వెనుకలా ఉన్న అదృశ్య హస్తం ఎవరిది..?

**ఎప్పుడు చిన్నవాళ్లే బలి.. ?**

ప్రభుత్వ యంత్రాంగంలో ఏ శాఖలో చూసిన ఎక్కువగా అనేక సందర్భాల్లో తప్పుఒప్పులు జరుగుతూంటాయి. ఆ తప్పులు సమాజంలో వెలుగు చూసినప్పుడు ప్రభుత్వ యంత్రాంగం.. మహాభారతం, రామయాణం.. లాంటి సీరియల్స్‌ను మించి అనేక విచారణలు జరిపి చివరికి చిరు ఉద్యోగులనే బలిపశువులను చేయడం నాటి నుండి నేటికి జరుగుతూనే ఉంది. ప్రభుత్వ యంత్రాంగంలో "పోలీస్" లేని ఈ సమాజాన్ని క్షణకాలం సైతం ఉహించుకోలేం. బార్డర్‌లో సైనికులు, జనసంద్రంలో పోలీస్ యంత్రాంగం ఉంటేనే అందరం ప్రాథమిక హక్కులను వినియోగించుకుని భరోసా, భద్రతతో జీవిస్తున్నాము. ఇంత వరకు గౌరవంగా చెప్పుకోవచ్చు. ఇక్కడ మాత్రం ఇదే శాఖలో చిన్న ఉద్యోగులను సస్పెండ్ చేసారు. ఇదే డివిజన్‌లో టిప్పర్లు నెలల తరబడి నడిచినప్పటి టిప్పర్ల సొమ్ము తీసుకున్నది ఎవరు..? వారిపై విచారణ చర్యలు లేవా..? అంటూ ఈ ప్రాంత ప్రజలు గుసగుసలాడుతున్నారు. తప్పు ఎవరు చేసిన తప్పే కదా..? ప్రతి సంఘటనపైన సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటేనే హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్ మండలాల నుండి అక్రమ ఇసుక రవాణ నూటికి 99శాతం నిలిచిపోతుందని ఈ ప్రాంత ప్రజలు తెగేసి చెబుతున్నారు.



# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు మినహాయించాలి..

## జిల్లా కలెక్టర్ కు వినతి

*జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త:*

కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు మినహాయించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. సోమవారం టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఈ విషయంపై జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో జర్నలిస్టు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్థిక స్థితిగతులపై జిల్లా



కలెక్టర్ కు వివరించి పాఠశాల ఫీజుల్లో రాయితీ కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం బాపురావు మాట్లాడుతూ ప్రస్తుతం మన జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దాదాపు 80 శాతం జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక తమ పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఫీజులు కట్టలేకపోతున్నారన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రాయితీ అమలు చేయాలని కోరారు. రాబోయే 202627 విద్యా సంవత్సరంలో జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా జీవో/సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పిఎస్ రవీంద్ర, టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్, భూపతి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము గణేష్, లక్కం సురేష్, కార్యదర్శులు కిరణ్, ఎండి ఖాజా, నాయకులు సుదర్శన్ రెడ్డి, అనిల్, హుజురాబాద్ డివిజన్ అధ్యక్షుడు యోహాన్, దీక్షి త్, గౌతమ్, రాం ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు కలెక్టర్ చిత్రా మిశ్రా

*కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:*

ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా, వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి , ఆర్డీవో షర్మిల, కలెక్టరేట్ ఏవో సుధాకర్ రెడ్డి తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 256 దరఖాస్తులు రాగా.. అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 142,కరీంనగర్ నగరపాలిక సంస్థకు 60 వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయ శాఖ, విద్యా శాఖల అధికారులతో మొదటి విడత రివ్యూ మీటింగ్ నిర్వహించామన్నారు. బుధవారం నిర్వహించే రెండో విడత మీటింగ్ కి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో డీపీఓ, డీఆర్డీఓ అధికారులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పెండింగ్ కోర్టు కేసులు, దరఖాస్తులు, పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని హాయ్ శాఖల అధికారులను ఆదేశిం చారు. ఈవారం యాక్షన్ ప్లాన్, తనిఖీ రిపోర్టులను శుక్రవారం సా య ం ం త్ర ం లో గా సమర్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అ ది . కా ర ు ల ు పాల్గొన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శాఖల వారీగా



# రాష్ట్ర ప్రథమ ర్యాంకర్‌కు కలెక్టర్ అభినందనలు

*కరీంనగర్ కలెక్టరేట్ , ప్రభాతవార్త:*

ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థిని కడారి రశ్మితను, కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రశ్మితకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో మొత్తం 470 మార్కులకు గాను 469 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంకు సాధించడం విశేషమని కలెక్టర్ కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతోనే ఇలాంటి అసాధారణ విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జిల్లా పేరును మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని విద్యార్థినికి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, రామడుగు సర్పంచ్ మొయిజ్, రామడుగు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.



## చేనేత సహకార సంఘానికి అండగా ఉంటా... .. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘాల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్ శ్రీ శ్రీనివాస చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గ సభ్యులు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గోలి పద్మ, ఉపాధ్యక్షుడు గుండ రాజేశం, కోశాధికారి ఎనగంటి ఆగయ్యతో పాటు డైరెక్టర్లు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిదని పేర్కొన్నారు. చేనేత కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులైన చేనేత కార్మికులకు చేరేలా ప్రత్యేక కృషి చేస్తానన్నారు. చేనేత సహకార సంఘం అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు. నూతన పాలకవర్గ సభ్యులను అభినందిస్తూ సంఘ ప్రగతికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు సంఘ అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## అన్నదానానికి మించిన దానం లేదు.

సుల్తానాబాద్, ప్రభాతవార్త:

అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మాజీ జెడ్పిటిసి డాక్టర్ అయిల రమేష్ పేర్కొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి భాస్కర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వికలాంగులకు భోజనంతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బిరుదు రాధాకృష్ణ, డాక్టర్ అయిల రమేష్



మాట్లాడుతూ పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలను ఆర్భాటాలకు దూరంగా సమాజ సేవకు వినియోగించడం అభినందనీయమన్నారు. పేదలు, నిరుపేదలు, మానసిక వికలాంగులకు అన్నదానం చేయడం ద్వారా మానవత్వం చాటుకోవచ్చని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కందుకూరి ప్రకాష్‌రావు (పెద్దన్న), మార్కెట్ కమిటీ డైరెక్టర్ పల్ల వాసు శ్రీనివాస్, ఒల్లాల రాజు, పెగడ పరశురాములు, ఏల్లే రాజు, యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్‌కుమార్, రమేష్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం పోయినా పట్టించుకోరా...!-పోలీసుల తీరుపై బాధితుడి ఆవేదన

నర్సంపేట, జూన్ 15, ప్రభాతవార్త

తనపై హత్యాయత్నం చేసిన వారిపై చర్య తీసుకోవాలని పోలీసులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు బొంత రవి ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని వడ్డెర కాలనికి చెందిన బొంత రవి గత కొంత కాలం నుంచి కుటుంబ కలహాలతో భార్యకు దూరమై ఒంటరిగా జీవిస్తున్నాడు. భార్య రాదమ్మ తన ఇద్దరు కొడుకులతో హనుమకొండలో నివాసం ఉంటుంది. రవి నర్సంపేట ఒడ్డరి కాలనీలో ఇంటి వద్దనే ఒంటరిగా ఉంటూ కూలిపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రవికి 236 గజాల నివాస స్థలం ఉంది. కాగా భార్య యాదమ్మ కొడుకులు



రాజేష్, గణేష్‌లతో పాటు తన తండ్రి సారయ్య తల్లి సాయమ్మ తమ్ముడు రాజులతో కలిసి గతంలో ఒంటరిగా ఇంట్లో పడుకున్న సమయంలో వచ్చి దాడి చేశాడు. ఇట్టి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం మరో రెండు సార్లు సైతం ఇంట్లో పడుకున్న సమయంలో వచ్చి కత్తులు గొడ్డళ్లతో కాళ్లపై కొట్టగా బలమైన గాయాలయ్యాయి. అప్పుడు కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. మరల ఈ నెల 12న రాత్రిపూట పడుకున్న సమయంలో పై వారందరు వచ్చి దాడి చేయగా రెండు కాళ్లకు బలమైన దెబ్బలు తాకాయన్నారు. ఇట్టి విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పలుసార్లు తన భార్య అత్తమామ, బావమరిది కొడుకులతో పాటు వచ్చి హత్యాయత్నం చేస్తున్నారని ఇట్టి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

### మా వ్యవసాయ భూములకు తెలంగాణ పట్టా ఇవ్వండి

నల్లబెల్లి, జూన్ 15, ప్రభాతవార్త

దాదాపు నాలుగు దశాబ్దాల కాలం ముందు నుండి వ్యవసాయ భూమిని నమ్ముకుని సాగు చేసుకుంటున్న మా భూములకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పట్టాలు ఇవ్వాలని కోరుతూ మండలంలోని కన్నరావుపేట, బుచ్చిరెడ్డిపల్లి, వద్మాపురం, పంతులు పల్లి గ్రామాల రైతులు సర్పంచ్ పల్నాటి మూర్తి ఆధ్వర్యంలో నర్సంపేట ఆర్డిఓ ఉమారానికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ కన్నారావుపేట శివారు రెవిన్యూ పరిధిలో 58 సర్వే నెంబర్లు ఉన్నటువంటి సుమారు 1400 ఎకరాల భూమిని ప్రస్తుతం మోకా మీద ఉన్నటువంటి రైతులకు సంబంధిత రెవిన్యూ శాఖ నుండి త్వరతగతిన సర్వే చేయించి తెలంగాణ పట్టా పాస్ పుస్తకాన్ని అందజేయాలని వారు సంబంధిత శాఖతో పాటు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్య చాలా కాలం నుండి



ఉత్పన్నమవుతుందని సమస్యను మరింత జటిలం చేయకుండా తరితగతిన పూర్తి చేయాలని వారు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పట్టా పుస్తకాల సైతం ఇలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా మోకా మీద ఉన్నటువంటి అసలైన రైతులకు అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కన్నారావుపేట వద్మాపురం బుచ్చిరెడ్డిపల్లి పంతులుపల్లి గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వల్లాపురంలో బడిబాట

నడిగూడెం, జూన్ 15, ప్రభాతవార్త:

మండలంలోని వల్లాపురం లో ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు, త్వరలో యూనిఫామ్ కూడా అందజేయనున్నట్లు ఎంఈఓ వనం సత్యనారాయణ తెలిపారు.

## ఆక్సిడెంట్ కేసులో డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష.

సుల్తానాబాద్, ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతికి కారణమైన డ్రైవర్‌కు సుల్తానాబాద్ కోర్టు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. కోర్టు వివరాల ప్రకారం.. 2017 జనవరి 15న పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామానికి చెందిన ఎర్రం అమరేందర్ రెడ్డి (19) దుబ్బపల్లి గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా, కనుకుల గ్రామానికి చెందిన చిలుక సురేష్ తన టవేరా వాహనాన్ని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అమరేందర్ రెడ్డికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని చలిమెడ ఆనందరావు ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 8 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎర్రం నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బి. జీవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేయగా, విచారణ జరిపిన సుల్తానాబాద్ న్యాయస్థానం నిందితుడు చిలుక సురేష్‌ను దోషిగా నిర్ధారించింది. ఈ మేరకు సుల్తానాబాద్ మెజిస్ట్రేట్ దుర్గం గణేశ్ నిందితుడికి ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన ఏపీపీ శ్యాంప్రసాద్ రావు, కోర్టు కానిస్టేబుల్ దేవరాజుల సేవలను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అభినందించారు.

## యాదవ సంఘం యూత్ సభ్యులకు క్రికెట్ కిట్ పంపిణీ



జూలపల్లి, ప్రభాతవార్త:

జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో సోమవారం యాదవ సంఘము యూత్ సభ్యులు క్రికెట్ కిట్ కావాలని, గ్రామ యువ నాయకుడు కళ్ళేపెల్లి నవీన్ కుమార్ ను కోరగా వెంటనే స్పందించి గ్రామ సర్పంచ్ తొగరు శ్రీనివాస్, ఉపసర్పంచ్ జెల్ల కనకయ్య చేతుల మీదగా వారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ చైర్మన్ గడ్డమిది శ్రీనివాస్, డైరెక్టర్ ఉయ్యాల వెంకటేష్, క్రాంతికుమార్, ఇస్మాయిల్, సంపత్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యాపారంలో ఆర్థికంగా నష్టపోవడంతో ఆత్మహత్య

ఓదెల, ప్రభాతవార్త:



ఓదెల మండలం లోని శానగొండ గ్రామానికి చెందిన కోదాటి రాకేష్ రావు తండ్రి తిరుపతిరావు (36) అను వ్యక్తి వ్యాపారంలో ఆర్థికంగా నష్ట పోవడం వలన మానసికంగా బాధపడుతూ ఇంటి దగ్గర ఒంటరిగా ఉంటూ తనలో తానే కుమిలిపోయేవాడు ఆదివారం మధ్యాహ్నం దాదాపు రెండు గంటల సమయంలో ఇంటి దగ్గర నుంచి పొలం దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్ళినాడు రాత్రి వరకు ఇంటికి రాకపోవడం వలన కుటుంబ సభ్యులు వ్యవసాయ బావిలోని నీటిని తోడి వెతకగా మృతుడి మృతదేహము బావిలోనే నీటిలో తేలింది అని మృతుడి తండ్రి కోదాటి తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోత్కపల్లి ఎస్సై సనత్ రెడ్డి తెలిపినారు

## శాంతి భద్రతలు అదుపులో ఉంచేందుకు నిర్విరామంగా కృషి

జూలపల్లి, ప్రభాతవార్త:



జూలపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలు అదుపులో ఉంచేందుకు పోలీస్ వారు నిర్విరామంగా కృషి చేస్తున్నామన్నారని, శాంతి భద్రతల పరిరక్షణ అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు ఇందులో పౌరుల పాత్ర కూడా ఎంతో అవసరమని అన్నారు. సాంకేతికత వినియోగం నిరంతర నిఘ పలు అంశాలపై చర్చించారు. వారి వెంట ఎలిగేడు ఎస్సై మధుకర్, ఏ ఎస్ఐ సులేమాన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.